PRGI NO: APTEL/26/A1204

# కింగ్

డైలీ న్యూస్ పేపర్

King Daily News Paper

జైత్ర
మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

All Insurances Cashless Available | 24/7 Emergency Services | Ambulance Services

+91 85230 89599 +91 86889 09384

Web: www.jaitrahospitals.com Mail: info@jaitrahospitals.com

Address: Beside ITI, NH 44, Chandra Nagar, Medchal, Telangana 501401.

విజయవాడ, హైదరాబాద్ ఎడిటర్ : కలిదిండి రఘురామ రాజు సంపుటి : 01 సంచిక : 92 బుధవారం , జూలై 08 , 2026 , పేజీలు - 8 వెల : 3 /-



## భోగాపురం సిద్ధం..

### విమానాశ్రయం త్వరలో ప్రారంభం

**భోగాపురం విమానాశ్రయాన్ని సందర్శించిన రామ్మోహన్ నాయుడు**

**అన్ని పనులు పూర్తయ్యాయని తెలిపిన కేంద్ర మంత్రి**

**మోదీ సమయం ఖరారు చేస్తే ప్రారంభోత్సవం ఉంటుందని వెల్లడి**

**అమరావతి, జూలై 07:** ఉత్తరాంధ్రలో కొత్త అభివృద్ధి చరిత్రకు నాంది పలుకుతూ భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణం పూర్తి స్థాయికి చేరుకుంది. కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు విమానాశ్రయాన్ని సందర్శించి పనుల పురోగతిని సమీక్షించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన స్పష్టమైన ఆదేశాలతో మిగతాది 2లో...

# భూములు ఇచ్చిన రైతులకు 40వేల కౌలు


**పదేళ్లపాటు అమలు చేయాలని నిర్ణయం**

**జనవరి 6లోగా రుణం తీసుకున్న వారికి రుణమాఫీ అమలు**

**ల్యాండ్ పూలింగ్‌కు అంగీకరించని వారిపై భూసేకరణ కత్తి**

**ఇనాం భూముల కోసం దేవాదాయశాఖకు రూ.159 కోట్లు చెల్లింపు**

**చంద్రబాబు అధ్యక్షతన 63వ సీఆర్డీఏ సమావేశం లో కీలక నిర్ణయాలు**



**అమరావతి, జూలై 07:** సీఆర్డీఏ సమావేశంలో ఏపీ ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. 2024 జూన్ నుంచి భూములిచ్చిన వారికి రూ.40వేలు కౌలు ఇచ్చేందుకు ఆమోదం తెలిపింది. భూములు ఇచ్చినప్పటి నుంచి 10ఏళ్లపాటు ఇది అమలు కానుంది. గ్రామకంతాల్లో భూమి కోల్పోతున్న వారికి ఏటా రూ.10వేలు ఇచ్చేందుకు అనుమతిని ఇచ్చింది. కొత్తగా పూలింగ్ జరిగే గ్రామాల రైతులకు రుణమాఫీ చేయాలని నిర్ణయించింది. ఈ ఏడాది జనవరి 6లోగా రుణం తీసుకున్న వారికి ఈ మాఫీ అమలవుతుంది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన 63వ సీఆర్డీఏ సమావేశం జరిగింది. మంత్రి నారాయణ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, మిగతాది 2లో...



## పార్టీ పేరుమార్పుపై న్యాయ పోరాటం

### ఈసి నోటీసులపై ఢిల్లీ హైకోర్టులో కవిత పిటిషన్


**న్యూఢిల్లీ, జూలై 07:** పేరు మార్చుకోవాలంటూ కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన నోటీసులపై కల్వకుంట్ర కవిత ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. పార్టీ ఖరారుపై కల్వకుంట్ల కవిత దిల్లీ హైకోర్టులో న్యాయ పోరాటానికి దిగారు. మిగతాది 2లో...

## పాతబస్తీలో ఓటర్ల నమోదుపై బీజేపీ అభ్యంతరం

**ఇంటింటి సర్వే జరపకుండా మజ్లిస్ శిబిరాల్లో ఫారాల పంపిణీ జరుగుతోందని ఆరోపణ**

**బీఎల్ఓలు నిబంధనలు పాటించడం లేదని ఈసీకి ఫిర్యాదు**

**తెలంగాణ సీఈఓ సుదర్శన్ రెడ్డికి వినతిపత్రం సమర్పించిన బీజేపీ నేతలు**



2లో.

## కేరళ,గోవా తరహాలోనే బీచ్ షాక్స్

- ఆందోళన చెందాల్సిన అవసరం లేదు
- సామాన్య పర్యాటకులకు దూరంగా ఏర్పాటు
- ఎక్సైజ్ శాఖామంత్రి కొల్లు రవీంద్ర వెల్లడి



**రాజమండ్రి, జూలై 07:** కేరళ, గోవా తరహాలో రాష్ట్రంలో బీచ్ షాక్స్ ఏర్పాటు చేస్తున్నామని మంత్రి కొల్లు రవీంద్ర వివరించారు. టూరిజం అభివృద్ధిలో భాగంగా విశాఖపట్నం, సూర్యలంకలో ఫైవ్‌స్టార్ హోటల్స్ ద్వారా బీచ్ షాక్స్‌లో మద్యం విక్రయాలు నిర్వహిస్తామని మంత్రి వెల్లడించారు. మంగళవారం రంపచోడవరం మండలం పందిరి మామిడిలో నీరా ప్లాంటేషన్‌ను ప్రారంభించారు.

మిగతా2లో...

## గుజరాత్ హైకోర్టు సంచలన తీర్పు

**2008 వరుస బాంబు పేలుళ్ల కేసులో 38మందికి ఉరి**

**మరో 11 మందికి యావజ్జీవ కారాగార శిక్ష విధింపు**

**ప్రత్యేక కోర్టు తీర్పును సమర్థించిన హైకోర్టు**



**అహ్మదాబాద్, జూలై 07:** దేశాన్ని ఉలిక్కిపడేలా చేసిన 2008 అహ్మదాబాద్ వరుస బాంబు పేలుళ్ల కేసులో గుజరాత్ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ప్రత్యేక కోర్టు 2022లో విధించిన శిక్షలను సమర్థిస్తూ 38 మంది దోషులకు ఉరిశిక్షను, మరో 11 మందికి యావజ్జీవ కారాగార శిక్షను హైకోర్టు మంగళవారం ఖరారు చేసింది. మిగతా 2లో...

## ఇబ్రహీంపట్నం, మేడ్చల్, మహేశ్వరంలకు మహర్దశ

**రూ.338 కోట్లతో నాలుగు లేన్ల ఆధునిక రహదారులు**

**నిర్మాణానికి శంకుస్థాపన చేసిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి**



**రంగారెడ్డి, జూలై 07:** రూ.338 కోట్ల వ్యయంతో ఇబ్రహీంపట్నం, మేడ్చల్, మహేశ్వరం నియోజకవర్గాల్లో హైబ్రిడ్ అన్యుటీ మోడల్ విధానంలో చేపట్టనున్న ఆధునిక నాలుగు లేన్ల రహదారుల నిర్మాణ పనులకు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఈటల రాజేందర్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సభలో మంత్రి మిగతాది 2లో...

# సంప్రదాయ హస్తకళా వారసత్వానికి ఆంధ్రా పుట్టినిల్లు

● హస్తకళలను ప్రపంచ నలుమూలలకు తీసుకెళ్దాం ● మార్కెట్ సౌకర్యం కల్పిస్తే ఉపాధితో పాటు, కళ సజీవంగా ఉంటుంది

● దేశ సంస్కృతి, సంప్రదాయాల కోసం హస్తకళను కాపాడాలి ● వారసత్వాన్ని సజీవంగా కొనసాగిస్తున్న తీరు అభినందనీయం

● కళాకారుల ఆరోగ్య రక్షణకు చర్యలు తీసుకోవాలి ● హస్తకళా మహోత్సవన్‌ను సందర్శించిన డిప్యూటి సిఎం పవన్



**విజయవాడ, జూలై 07:** ఏపీ హస్తకళలను ప్రపంచ నలుమూలలకు తీసుకెళ్దామని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. మార్కెటింగ్ ఇంకా పెంచగలిగితే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చన్నారు. విజయవాడ అంబేడ్కర్ కళా వేదికలో నిర్వహించిన ఏపీ హస్తకళా మహోత్సవానికి పవన్ కల్యాణ్ హాజరయ్యారు. హస్తకళాకారులను అనారోగ్య సమస్యల నుంచి కాపాడాలన్నారు. తొలుత అందరికీ ఆరోగ్య పరీక్షలు చేయించాలని, హస్తకళాకారుల పిల్లలు చదువుకునేలా ఏర్పాట్లు చేయాలని అన్నారు. వంశపారం పర్యంగా వచ్చిన కళను ముందుకు తీసుకెళ్లడం కూడా ముఖ్యమే. హస్తకళా రంగాలు భారతదేశ మూలాలు. దేశ సంస్కృతి, సంప్రదాయాలు కొనసాగాలంటే హస్తకళను, చేనేతను కాపాడుకోవాల్సి ఉందన్నారు. ఒక జాతి గొప్పతనం.. నిర్మించిన భవనాల్లో కాదు.. కళాకారుల్లో కనిపిస్తుంది. కళాకారుల ప్రతిభ.. వారి కష్టాన్ని గుర్తించడానికే ఇక్కడికి వచ్చాను. సంప్రదాయ హస్తకళా వారసత్వానికి ఆంధ్రప్రదేశ్ పుట్టినిల్లు. అద్భుత కళల వెనుక లక్షల మంది కళాకారుల కృషి ఉంది. వస్తువుల తయారీ మాత్రమే కాదు.. వారసత్వాన్నీ సజీవంగా ఉంచుతున్నారు. తరతరాల సంప్రదాయాన్ని కళాకారులు కాపాడుతున్నారని

## ఈ25 పెట్రోల్ తెచ్చే ప్రతిపాదన లేదు

### ఈ25 పెట్రోల్ పై కేంద్రం కీలక ప్రకటన

**ఈ25 పెట్రోల్ పై వస్తున్న వదంతులను నమ్మవద్దని ప్రజలకు సూచన**

**వాహనాలపై ఈ25 అనుకూలతపై ఇంకా పరీక్షలు జరుగుతున్నాయని వెల్లడి**

**ఈ20 పెట్రోల్ పై మైలేజ్, ఇంజిన్ పనితీరుపై ప్రజల్లో నెలకొన్న ఆందోళనలు**

**దశలవారీగా, ఆచితూచి మాత్రమే ముందుకు వెళ్తామని ప్రభుత్వ హామీ**




**న్యూఢిల్లీ, జూలై 07:** దేశవ్యాప్తంగా 25 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్ (ఈ25)ను త్వరలో ప్రవేశపెట్టనున్నట్లు వస్తున్న వార్తలపై కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. అటువంటి ప్రతిపాదన ఏదీ ప్రస్తుతం తమ పరిశీలనలో లేదని ప్రభుత్వం తేల్చి చెప్పింది. ఈ వదంతుల నేపథ్యంలో వాహన దారుల్లో నెలకొన్న ఆందోళనలను నివృత్తి చేసే మిగతాది 2లో...

# భోగాపురం సిద్ధం..

(మొదటి పేజీ తరువాయి)

జీఎంఆర్ సంస్థ షెడ్యూల్ ప్రకారం పనులు పూర్తి చేసిందని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. ఇప్పటికే ఎయిరోడ్రోమ్ లైసెన్స్ వచ్చేసిందని వెల్లడించారు. ప్రధాని మోదీ సమయం ఖరారు చేస్తే వారి చేతుల మీదుగా ప్రారంభోత్సవ వేడుక ఉంటుందని కేంద్ర మంత్రి తెలిపారు. 78 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మితమైన టెర్మినల్ భవనం సంవత్సరానికి ఏకంగా నాలుగు కోట్ల మంది ప్రయాణికులకు సేవలు అందించే సామర్థ్యం కలిగి ఉంటుందని చెప్పారు. ఉత్తరాంధ్ర సంస్కృతి, కళలు ఉట్టిపడేలా డిజైన్ చేయడంతో ఇది దేశంలోనే అత్యుత్తమ విమానాశ్రయాల్లో ఒకటిగా నిలుస్తుందని వ్యాఖ్యానించారు. ప్రారంభం అయిన వారం లోపు విశాఖ విమానాశ్రయ కార్యకలాపాలను భోగాపురానికి మార్చి పూర్తి స్థాయిలో సేవలు ప్రారంభిస్తామని తెలిపారు.

# ఈ25 పెట్రోల్ తెచ్చే ప్రతిపాదన లేదు

(మొదటి పేజీ తరువాయి)

ప్రయత్నం చేసింది. ఈ25 ఇంధనాన్ని తక్షణమే అందుబాటులోకి తీసుకువస్తున్నారన్న ప్రచారంలో వాస్తవం లేదని కేంద్రం ఉద్ఘాటించింది. వివిధ వాహన మోడళ్లపై ఈ25 మిశ్రమం యొక్క అనుకూలతపై ప్రస్తుతం పరీక్షలు కొనసాగుతున్నాయని, పూర్తిస్థాయి నివేదికలు అందిన తర్వాతే దీనిపై విధానపరమైన నిర్ణయం తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా అందుబాటులో ఉన్న ఈ20 (20 శాతం ఇథనాల్) పెట్రోల్ సురక్షితమైనదని, అది సమర్థవంతంగా పనిచేస్తోందని వారు తెలిపారు.

ముడి చమురు దిగుమతులు తగ్గించడం, పర్యావరణ పరిరక్షణ, మరియు చెరకు రైతులను ఆదుకోవడం వంటి లక్ష్యాలతో కేంద్ర ప్రభుత్వం ఇథనాల్ బ్లెండింగ్ కార్యక్రమాన్ని ప్రోత్సహిస్తోంది. ఇప్పటికే నిర్ణీత గడువు కంటే ముందే భారత్ ఈ20 లక్ష్యాన్ని చేరుకుంది. అయితే, ఈ20 పెట్రోల్ వాడకం వల్ల మైలేజీ తగ్గడం, పాత వాహనాల ఇంజిన్ల పనితీరు దెబ్బతినడం వంటి ఆందోళనలు సామాజిక మాధ్యమాల్లో వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలోనే ఈ25 వస్తుందనే వార్తలు వాహనదారుల్లో మరింత ఆందోళన రేకెత్తించాయి. ఇటీవల ప్రభుత్వం ఈ22 నుంచి ఈ30 వరకు ఇథనాల్ మిశ్రమాలపై ఎక్సైజ్ సుంకం మినహాయింపు ఇవ్వడంతో ఈ25 త్వరలోనే వస్తుందనే ఊహాగానాలు పెరిగాయి. అయితే, ఈ20 తర్వాత ఏ నిర్ణయం తీసుకున్నా అది దశలవారీగా ఉంటుందని, వాహన తయారీ సంస్థల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే తుది నిర్ణయం ఉంటుందని ఓ ఉన్నతాధికారి వెల్లడించారు. ధృవీకరించని సమాచారాన్ని నమ్మి ఆందోళన చెందవద్దని కేంద్రం ప్రభుత్వం ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

# పాతబస్తీలో ఓటర్ల నమోదుపై బీజేపీ అభ్యంతరం

**హైదరాబాద్, జూలై 07:** హైదరాబాద్ పాతబస్తీలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భారీ అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని బీజేపీ ఆరోపించింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) సి. సుదర్శన్ రెడ్డిని కలిసిన ఆ పార్టీ నేతలు ఫిర్యాదు చేశారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) క్షేత్రస్థాయిలో ఇంటింటికి తిరగడం లేదని, దానికి బదులుగా మజ్లిస్ పార్టీ నేతలు ఏర్పాటు చేసిన శిబిరాల ద్వారానే ఓటరు నమోదు ఫారాలను పంపిణీ చేస్తున్నారని ఆరోపించారు. కేవలం ఫారాల పంపిణీకే పరిమితం కాకుండా, పూర్తి చేసిన దరఖాస్తులను అప్‌లోడ్ చేసేందుకు వినియోగించే ఎన్నికల సంఘం అధికారిక యాప్‌ను సైతం మజ్లిస్ నేతలకే అప్పగిస్తున్నారని బీజేపీ తన ఫిర్యాదులో పేర్కొంది. పాతబస్తీతో పాటు జీహెచ్ఎంసీ, సైబరాబాద్, మల్కాజ్‌గిరి, వరంగల్, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో చాలామంది ఓటర్లకు కనీసం దరఖాస్తు ఫారాలు కూడా అందలేదని వివరించింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు నేతృత్వంలోని ప్రతినిధి బృందం ఈ సందర్భంగా పలు అంశాలను సీఈఓ దృష్టికి తీసుకెళ్లింది. హైదరాబాద్‌లో కేవలం ఆంగ్ల భాషలో, జిల్లాల్లో తెలుగులో ఫారాలను పంపిణీ చేయడం వల్ల ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడకు వచ్చి స్థిరపడిన ఓటర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంది. ఇంటింటి సర్వేను తప్పనిసరి చేయాలని, ఓటర్లు అందుబాటులో లేని పక్షంలో బీఎల్ఓలు కనీసం మూడుసార్లు వారి ఇళ్లను సందర్శించేలా ఆదేశాలు జారీ చేయాలని బీజేపీ విజ్ఞప్తి చేసింది. ఓటర్ల జాబితా సవరణ కోసం జూన్ 25న ప్రారంభమైన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ జూలై 24 వరకు కొనసాగనుంది. జూలై 31న ముసాయిదా జాబితాను, అక్టోబర్ 1న తుది జాబితాను ఎన్నికల సంఘం ప్రచురించనుంది.

# పార్టీ పేరుమార్పుపై న్యాయ పోరాటం

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ రక్షణ సమితి పేరు తన పార్టీకి కేటాయించాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. తమ పార్టీ పేరును ఖరారు చేయడానికి ఎన్నికల సంఘం అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ జూన్ 23న లేఖ పంపిందని పిటిషన్‌లో పేర్కొన్నారు. తమకు ప్రత్యామ్నాయమైన పార్టీ పేర్లు చెప్పాలి తప్ప.. టీఆర్ఎస్ వచ్చే విధంగా ఎలాంటి పేరు ఉండొద్దని ఈసీ తెలిపిందని కోర్టు దృష్టికి తెచ్చారు. తెలంగాణ రక్షణ సేన పేరు టీఆర్ఎస్‌కు అర్థం వచ్చేలా ఉందని, ఈసీ నోటీసుకు సరైన రీతిలో సమాధానం చెప్పాలని దిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. అయితే ఈసీకి సమాధానాలు చెప్పాకే కోర్టుకు రావాలని కవితకు సూచించింది. పిటిషన్ విచారణకు చేపట్టడమంటే ఈసీ విధుల్లో జోక్యం చేసుకోవడమేనని న్యాయస్థానం అభిప్రాయపడింది.

# గుజరాత్ హైకోర్టు సంచలన తీర్పు

(మొదటి పేజీ తరువాయి)

ఈ కేసులో దాఖలైన అప్పీళ్లపై సుదీర్ఘ విచారణ అనంతరం న్యాయస్థానం ఈ తీర్పును వెలువరించింది 2008, జులై 26న అహ్మదాబాద్‌లో కేవలం 70 నిమిషాల వ్యవధిలో 21 చోట్ల బాంబు దాడులతో ఉగ్రవాదులు విరుచుకుపడ్డారు. ఈ దాడుల్లో 56 మంది మరణించగా, 246 మంది తీవ్ర గాయాలపాలయ్యారు. ఆ తర్వాత సూరత్‌లో పేలని బాంబులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మొత్తం 78 మందిపై విచారణ జరగగా, 2022లో ప్రత్యేక కోర్టు 49 మందిని దోషులుగా తేల్చి, 28 మందిని నిర్దోషులుగా విడుదల చేసింది. ఉరిశిక్ష అమలుకు హైకోర్టు ధ్రువీకరణ తప్పనిసరి కావడంతో రాష్ట్ర ప్రభుత్వం శిక్షల నిర్ధారణ కోసం హైకోర్టును ఆశ్రయించింది. జస్టిస్ అల్పేష్ కొగ్జే, జస్టిస్ సమీర్ దవేలతో కూడిన గుజరాత్ హైకోర్టు ధర్మాసనం గత రెండున్నరేళ్లుగా దాదాపు 248 సార్లు అప్పీళ్లపై విచారణ జరిపి మంగళవారం తుది తీర్పు వెల్లడించింది. . 38 మందికి మరణశిక్ష, 11 మందికి జీవితఖైదు విధిస్తూ 2022లో ప్రత్యేక న్యాయస్థానం ఇచ్చిన తీర్పును సమర్థించింది. కిందికోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను కొట్టివేసింది. ఈ పేలుళ్లలో మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు, గాయపడినవారికి రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలని గుజరాత్ ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. మార్చి 31, 2027లోగా పరిహార చెల్లింపులు పూర్తి చేయాలని పేర్కొంది. నిషేధిత ఇండియన్ ముజాహిదీన్ , సిమి ఉగ్రవాద సంస్థల కుట్రను ప్రాసిక్యూషన్ నిరూపించగలిగింది. దేశద్రోహం, హత్య నేరాలతో పాటు కఠినమైన ఉగ్రవాద నిరోధక చట్టం 'ఉపా' కింద దోషులుగా న్యాయస్థానం తేల్చింది. కాగా, దేశ చరిత్రలోనే ఒకే కేసులో ఇంతపెద్ద సంఖ్యలో 38 మందికి ఉరిశిక్షలు ఖరారు కావడం ఇదే ప్రథమం. 2008 జులై 26న అహ్మదాబాద్‌లో 21 చోట్ల జరిగిన వరుస పేలుళ్లలో 56 మంది ప్రాణాలు కోల్పోయారు. 246 మంది గాయపడ్డారు. నగరవ్యాప్తంగా ఆసుపత్రులు సహా పలుచోట్ల పేలుళ్లు జరగ్గా రెండ్రోజుల తర్వాత సూరత్‌లోనూ బాంబులు గుర్తించారు. ఇక పేలుళ్ల శబ్దాలకు సమీపంలో ఉన్నవారు కొంతకాలం వినికిడి శక్తి కోల్పోయారు. దర్యాప్తులో భాగంగా అహ్మదాబాద్ నగర నేరవిభాగం 100 మందిని నిందితులుగా పేర్కొంది. 78 మందిపై విచారణ చేపట్టింది. 2022లో ప్రత్యేక న్యాయస్థానం ఇచ్చిన తీర్పులో 49 మందిని దోషులుగా నిర్ధరించింది. 28 మందిని నిర్దోషులుగా విడుదల చేసింది. అప్రూవర్‌గా మారిన ఒక నిందితుడికి క్షమాభిక్ష ప్రసాదించింది. తొలుత ఇచ్చిన వాంగ్మూలాలు ఉపసంహరించుకున్న మరో నలుగురు అప్రూవర్ల కు శిక్ష విధించింది. 2002లో జరిగిన గోధ్రా అనంతర అల్లర్లకు ప్రతీకారంగానే ఈ దాడులు జరిపినట్లు నాడు వార్తలు వచ్చాయి. తర్వాత ఇండియన్ ముజాహిదీన్ బాధ్యత ప్రకటించుకుంది. ఈ కేసు విచారణ సమయంలో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. 24 మంది నిందితులు టన్నెల్ తవ్వి జైలు నుంచి తప్పించుకునేందుకు యత్నించారు. అయితే ఆ కుట్రను పోలీసులు భగ్నం చేశారు.

# భూములు ఇచ్చిన రైతులకు 40వేల కౌలు

(మొదటి పేజీ తరువాయి)

వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రెండో దశ పూలింగ్‌లో భూములిచ్చిన రైతుల గురించి చర్చించారు. రైతులకు యాన్యుటీ, వ్యవసాయ రుణమాఫీ, ల్యాండ్ బ్యాంక్ ఏర్పాటు, మంత్రుల కమిటీ సిఫారసు మేరకు వివిధ సంస్థలకు భూ కేటాయింపులపై చర్చించారు. ఇనాం భూముల కోసం దేవాదాయశాఖకు రూ.159 కోట్లు చెల్లించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అమరావతి 25 టౌన్‌షిప్‌ల్లో ఒక ఇంటర్నేషనల్ స్కూల్ ఉండేలా చూడాలని సీఎం దిశానిర్దేశం చేశారు. అనంతరం మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడుతూ.. రాత్రిలోగా భూములివ్వనివారికి రేపు భూ సేకరణ అమలు చేస్తామన్నారు. ఇప్పటికే ల్యాండ్ అక్విజిషన్ నోటిఫికేషన్ 2.5 ఎకరాలకు అమలు చేస్తున్నామని తెలిపారు. రాజధాని అమరావతి అభివృద్ధి, రెండో దశ ల్యాండ్ పూలింగ్, రైతులకు యాన్యుటీ, వ్యవసాయ రుణమాఫీ, ల్యాండ్ బ్యాంక్ ఏర్పాటు, వివిధ సంస్థలకు భూ కేటాయింపులు సహా తదితర అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించి పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపినట్లు నారాయణ వివరించారు. సమావేశం అనంతరం మీడియాకు మంత్రి నారాయణ వివరాలు వెల్లడించారు. అదేవిధంగా ప్రతి ఏడాది జరీబు భూములకు ఎకరానికి రూ.5 వేల చొప్పున, మెట్ట భూములకు ఎకరానికి రూ.3 వేల చొప్పున యాన్యుటీ పెంపునకూ అథారిటీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిపారు. గ్రామ కంఠాల్లో భూములు కోల్పోయిన వారికి ఏడాదికి రూ.10 వేల చొప్పున చెల్లించాలని నిర్ణయించినట్లు మంత్రి నారాయణ వెల్లడించారు. కొత్తగా ల్యాండ్ పూలింగ్ జరుగుతున్న గ్రామాల్లో భూములు ఇచ్చే రైతు కుటుంబాలకు వ్యవసాయ రుణమాఫీ అమలు చేయాలని అథారిటీ నిర్ణయించినట్లు మంత్రి నారాయణ తెలిపారు. ల్యాండ్ పూలింగ్‌కు ఇంకా భూములు ఇవ్వని రైతులకు మంగళవారం రాత్రి వరకు అవకాశం కల్పిస్తున్నామని మంత్రి నారాయణ తెలిపారు. ఆ తర్వాతా భూములు ఇవ్వకపోతే బుధవారం నుంచి భూసేకరణ ప్రక్రియను అమలు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే జారీ చేసిన ల్యాండ్ అక్విజిషన్ నోటిఫికేషన్‌ను 2.5 ఎకరాల భూమికీ అమలు చేయనున్నట్లు మంత్రి నారాయణ వెల్లడించారు.

# కేరళ,గోవా తరహాలోనే బీచ్ షాక్స్

(మొదటి పేజీ తరువాయి)

పందిరిమామిడిలో రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకంలో భాగంగా ఉద్యాన పరిశోధనా కేంద్రంలో ఏర్పాటు చేసిన తాటి ఉత్పత్తుల తయారీ పరిశ్రమను జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, ఎక్సైజ్ కమిషనర్ శ్రీధర్, ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ , గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుదిపూడి సత్తిబాబులతో కలిసి పరిశీలించడమైనది. నీరా, తాటి బెల్లం, తాటి పానకం రుచి చూసి, యూనివర్సిటీ సమీపంలోని తాటి తోటలను పరిశీలించాము. అధికారులతో మాట్లాడి నీరా పరిశ్రమ, ఉప ఉత్పత్తుల గురించి అడిగి తెలుసుకోవడమైనది. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడారు. బీచ్‌లలో ఎవరికీ ఇబ్బంది లేకుండా నిర్మానుష్య ప్రదేశాల్లో బీచ్ షాక్స్ ఉంటాయని తెలిపారు. బీచ్ సాక్స్‌పై ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. టూరిజం అభివృద్ధికి తీసుకుంటున్న చర్యల్లో మాత్రమే ఇదో భాగమన్నారు. అక్టోబర్ నుంచి కొత్త ఎక్సైజ్ విధానం అమల్లోకి తీసుకువస్తామని చెప్పుకొచ్చారు. మద్యం అధిక ధరల అమ్మకాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేస్తున్నారని అన్నారు. ఎమ్మార్పీకి మించి అమ్మితే మద్యం షాపులు సీజ్ చేస్తామని మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు. ఇకపోతే దేశాన్ని, హిందూ మతాన్ని అవమానించిన వారిని జగన్ వెనకేసు కొస్తున్నారని వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి కొల్లు రవీంద్ర తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీలను పారిశ్రామికవేత్తలుగా మార్చేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని వ్యాఖ్యానించారు. జగన్ హయాంలో బీసీలకు ద్రోహం చేశారని దుయ్యబట్టారు. 34 శాతం ఉన్న బీసీ రిజర్వేషన్లు 24 శాతానికి తగ్గించారని చెప్పుకొచ్చారు. వైసీపీ హయాంలో 1,608 మంది బీసీలు పదవులు కోల్పోయారని తెలిపారు. వైసీపీ నేతలు బీసీ రౌండ్‌టేబుల్ పేరుతో కుట్రలు చేస్తున్నారని మంత్రి ఆగ్రహించారు. ఏపీకి పెట్టుబడులు రావడం జగన్‌కు ఇష్టం లేదని దుయ్యబట్టారు. వైసీపీ హయాంలో జరిగిన రూ.3500 కోట్ల లిక్కర్ స్కాం దేశంలోనే పెద్దదని సుప్రీంకోర్టు చెప్పిందని అన్నారు. పనికిరాని బ్రాండ్లతో వేలకోట్లు దోచుకున్నారన్న ÷ర్ అయ్యారు. నాసిరకం మద్యంతో వేలమందిని పొట్టన పెట్టుకున్నారని ఆరోపించారు. వైసీపీని అడ్రస్ లేకుండా చేస్తామని హెచ్చరించారు.

# ఇబ్రహీంపట్నం, మేడ్చల్, మహేశ్వరంలకు మహర్దశ

(మొదటి పేజీ తరువాయి)

కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ, ఇబ్రహీంపట్నం ప్రజలు, కార్యకర్తలు, నాయకులు తనపై ఉంచిన విశ్వాసం వల్లే రాష్ట్రంలో కీలకమైన రోడ్లు, భవనాల శాఖ మంత్రిగా సేవ చేసే అవకాశం లభించిందన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడం తన బాధ్యత అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రహదారుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఇప్పటికే రూ.85 కోట్ల విలువైన రహదారి పనులు పూర్తి చేశామని, మరో రూ.275 కోట్లతో పలు రహదారి అభివృద్ధి పనులు చేపడుతు న్నామని తెలిపారు. అదనంగా రూ.100 కోట్ల విలువైన కొత్త రహదారి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. పార్టీలు వేర్వేరు అయినప్పటికీ అభివృద్ధి విషయంలో అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, జాతీయ రహదారుల విస్తరణ, వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తూ తెలంగాణను మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని మంత్రి స్పష్టం చేశారు. పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో రూ.338 కోట్లతో 140కు పైగా రహదారి పనులు చేపట్టినట్లు తెలిపారు. గ్రామాలు, బస్తీల్లో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. విద్య, వైద్యం, మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించిందని, ప్రభుత్వ పాఠశాలలను ఆధునిక తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌గా తీర్చిదిద్దుతున్నట్లు పేర్కొన్నారు. లక్ష్మీరెడ్డి పాలెం వద్ద ఫ్లైఓవర్, అండర్‌పాస్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ, ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి రూ.338 కోట్ల విలువైన రహదారి పనులు మంజూరు కావడం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. ఇందులో సుమారు రూ.275 కోట్ల పనులు నేరుగా ఇబ్రహీంపట్నం పరిధిలో చేపడుతున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో నియోజకవర్గంలో 200 పడకల ఆసుపత్రి, ప్రభుత్వ పాఠశాలల ఆధునీకరణ, రహదారుల విస్తరణ వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతు న్నాయని చెప్పారు. అలాగే రూ.2,300 కోట్లతో సమీకృత మార్కెట్ ఏర్పాటు ద్వారా వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర రోడ్డు అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి కూడా సమాన ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రోడ్లు, భవనాల శాఖ ద్వారా భారీ స్థాయిలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రధాన రహదారులను నాలుగు లేన్లుగా అభివృద్ధి చేయడం ద్వారా రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు ఉపాధి, పెట్టుబడులు, ప్రాంతీయ అభివృద్ధికి ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, రంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్ చంద్రారెడ్డి, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# సంప్రదాయ హస్తకళా వారసత్వానికి ఆంధ్రా పుట్టినిల్లు

(మొదటి పేజీ తరువాయి)

అభినందించారు. రాష్ట్రంలో 2 లక్షల మందికిపైగా కళాకారులున్నారు. గ్లోబల్ మార్కెట్‌కు అనుసంధానం చేస్తూ హస్తకళా రంగానికి కొత్త దశను తీసుకొస్తాం. వదిలేసిన వస్త్రాలు కూడా వ్యర్థం కాకుండా వస్తువుల తయారీ చూస్తున్నాం. డబ్బు సంపాదనే కాదు.. పర్యావరణ పరిరక్షణ కూడా ప్రాముఖ్యంగా తీసుకుంటున్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా హస్తకళా రంగం కూడా అభివృద్ధి చెందాలి. మారుమూల గ్రామంలోని కళాకారుడి కృషి.. ప్రపంచానికి చేరాలనేదే ప్రభుత్వ లక్ష్యం. వోకల్ ఫర్ లోకల్ మాత్రమే కాదు.. లోకల్ టు గ్లోబల్ లక్ష్యంగా పని చేద్దామని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. సంప్రదాయ హస్తకళా వారసత్వానికి ఏపీ పుట్టినిల్లు అని పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. ఒక జాతి గొప్పతనం నిర్మించిన భవనాల్లో కాదని, కళాకారుల్లో కనిపిస్తుందని అభివర్ణించారు. కళాకారుల అద్భుత ప్రతిభను, వారి కష్టాన్ని గుర్తించడానికి తాను ఈ కార్యక్రమానికి వచ్చానని తెలిపారు. హస్తకళాకారుల వస్తువుల తయారీ మాత్రమే కాకుండా, వారసత్వాన్ని సజీవంగా ఉంచుతున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా, రామాయణంలోని రావణ సంహార ఘట్టాన్ని తోలుబొమ్మలాట కళాకారులు ప్రదర్శించిన తీరును పవన్ కల్యాణ్ అభినందించారు. ప్రతి స్టాల్‌ను సందర్శించి, హస్తకళా ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా కళాకారులను వ్యక్తిగతంగా పవన్ కల్యాణ్ ప్రోత్సహించారు. కళాకారులతో కలిసిపోయి, వారి నైపుణ్యాలను ప్రశంసించారు. వారి విజయాలు, సవాళ్ల గురించి అడిగి తెలుసుకున్నారు. వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అధికారులకు ఆదేశించారు. కళాకారుల కోరిక మేరకు, క్లస్టర్ల వారీగా గ్రూప్ ఫొటోలు తీసుకున్నారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడారు. ఏపీ హస్తకళల అభివృద్ధికి తమ ప్రభుత్వం అవసరమైన మద్దతును అందిస్తోందని స్పష్టం చేశారు.

# చరిత్ర సృష్టించిన మోదీ..

## ఇండోనేషియా పార్లమెంట్‌లో ప్రసంగించిన తొలి భారత ప్రధాని




**న్యూఢిల్లీ, జూలై 07:** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన ఇండోనేషియా పర్యటనలో చారిత్రక ఘట్టాన్ని ఆవిష్కరించారు. జకార్తాలో మంగళవారం ఇండోనేషియా పార్లమెంట్ ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించిన తొలి భారత ప్రధానిగా ఆయన సరికొత్త రికార్డు సృష్టించారు. ఇరు దేశాల మధ్య ఉన్న నాగరికత, చారిత్రక వారసత్వ సంబంధాలను గుర్తుచేస్తూ, ప్రాంతీయ స్థిరత్వం కోసం ఉమ్మడిగా కృషి చేయాల్సిన ఆవశ్యకతను ఆయన తన ప్రసంగంలో నొక్కిచెప్పారు. భారత్, ఇండోనేషియాలను సముద్రాలు వేరుచేయడం లేదని, చరిత్ర, సంస్కృతి, ప్రజాస్వామ్య విలువలనే వారధులు రెండు దేశాలను అనుసంధానం చేస్తున్నాయని మోదీ పేర్కొన్నారు. రామాయణ, మహాభారత కాలం నుంచి ఇరు దేశాల మధ్య దృఢమైన సాంస్కృతిక బంధం ఉందని ఆయన గుర్తుచేశారు. ఈ సందర్భంగా తమకు ఘన స్వాగతం పలికిన ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటోకు, పార్లమెంట్‌లో ప్రసంగించే అరుదైన అవకాశం కల్పించిన స్పీకర్‌కు ప్రధాని కృతజ్ఞతలు తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా ఇండోనేషియా ఎన్నికల వ్యవస్థ ఆధునికీకరణకు భారత్ పూర్తి సహకారం అందిస్తుందని ప్రధాని హామీ ఇచ్చారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం) అభివృద్ధిలో తోడ్పాటునందిస్తామని, అదేవిధంగా ఇండోనేషియాలో ఐఐఎం బెంగళూరు క్యాంపస్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. భారత ప్రభుత్వ పథకాలను తమ దేశంలోనూ అమలు చేస్తామని గతంలో ఇండోనేషియా అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, "మిత్రుల మధ్య కాపీరైట్లు ఉండవు" అని మోదీ చమత్కరించడంతో సభలో నవ్వులు విరిశాయి. ఇరు దేశాల మధ్య నెలకొన్న సుహృద్భావ వాతావరణానికి ఈ వ్యాఖ్య అద్దం పట్టింది. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం, శ్రేయస్సు కోసం రెండు దేశాల మధ్య సహకారం అత్యంత కీలకమని ప్రధాని ఉద్ఘాటించారు. జూలై 6 నుంచి 11 వరకు ఇండోనేషియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల్లో ప్రధాని మోదీ పర్యటిస్తున్నారు.

# సంపాదకీయం



# జనాభా పెరిగితే తట్టుకోగలమా ?

ఎన్నికల ముందు నేతలు ఇచ్చే హామీలన్నీ ఓట్ల కోసం అని ప్రజలు గుర్తించనంత వరకు ప్రజాస్వామ్యం అపహాస్యం అవుతూనే ఉంటుంది. అధికారంలోకి వచ్చాక సొంత ఎజెండాతో సాగుతారు. ఓట్ల కోసం తప్ప ప్రజలపై లేదా రాష్ట్రం, దేశంపై ప్రేమతో ఏ రాజకీయ నాయకుడు పనిచేయరని గుర్తించాలి. ఎపిలో చంద్రబాబు జనాభా విషయంలో చేస్తున్న విన్యాసం ఇదే. కేవలం మైనార్టీ ఓట్లను గంపగుత్తగా లాగేసేం దుకు అధికా జనాభా కావాలి, పిల్లను కనండి, డబ్బులు ఇస్తాను అంటున్నారు. ముగ్గురు అంతకన్నా ఎక్కువ ఉన్నవారికి తక్షణం 5వేల సాయం ప్రకటించారు. మరి లోకేశ్ ఒక్క పిల్లాడితోనే ఎందుకు సరిపుచ్చాడు. ఆయనకు ఈ నియమం వర్తించదా? చంద్రబాబు ఇంట్లోనే ఈ పద్దతి లేనప్పుడు రాష్ట్రానికి ఎందుకు అంటగట్టాలన్నది ప్రజలు ఆలోచన చేయాలి. ఇందులో ఏదో మతలబు లేకుండా చంద్రబాబు ప్రకటించరని గుర్తించాలి. ఇకపోతే ఎపిలో అనేక సమస్యలు ఉన్నాయి. ముఖ్యంగా శాంతి భద్రతలు క్షీణిస్తున్నాయి. సాయికృష్ణ అనే వ్యక్తిని పోలీసులు తీసుకుని వెళ్లి మాయం చేస్తే అతీగతీ లేదు. ఓ చిన్నారి తప్పిపోతే దిక్కులేదు. రేప్‌లు జరుగుంతుంటే అడిగేవారు లేరు. కేవలం అమరావతి ఒక్కటే ఇప్పుడు లక్ష్యంగా బాబు పాలన సాగిస్తున్నాడు. ఇప్పటికే 33 వేల ఎకరాలు సేకరించినా ఇంకా భూమి కావాలంటూ రైతులను వేధిస్తున్నారు. భూములు ఇచ్చిన వారికి సక్రమంగా ప్లాట్లు ఇచ్చి వారిని సంతోషంగా ఉంచడం లేదు. కేవలం రియల్ వ్యాపారం లక్ష్యంగా బాబు పాలన సాగుతోందని వైసిపి ఆరోపణలు చేస్తోంది. ప్రశ్నించిన వారిని వేధింపులకు గురిచేస్తున్నారని జగన్ విమర్శలు చేస్తున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను మరచిన పాలకులు అధికారంలోకి రాగానే తమ సొంత ఎజెండా అమలు చేస్తుంటారు. ఇలా ఎన్నికల సమయంలో ప్రజల ముందు ఎన్నో హామీలు ఇస్తారు. ఉద్యోగాలు, అభివృద్ధి, సంక్షేమం, మౌలిక సదుపాయాలు, అవినీతి నిర్మూలన వంటి అంశాలపై గొప్ప గొప్ప ప్రకటనలు చేస్తారు. కానీ ఎన్నికలు ముగిసిన తర్వాత వాటిలో చాలా హామీలు మరుగున పడిపోతాయి. అవినీతి అన్నది కేవలం ఉద్యోగులకే పరిమితం అయ్యింది. వారు లంచం తీసుకుంటే పట్టేస్తున్నారు. అలా పట్టుకుంటున్న వారి సంఖ్య ఒక్కశాతం కూడా ఉండదేమో. లంచం లేనిదే పని జరగడం లేదు. లంచాల కోసమే ఉద్యోగాలు ఇచ్చారేమో అనుకోవాలి. ఇకపోతే ఇప్పటికే దేశం అధిక జనాభాతో సతమతం అవుతోంది. ఉన్న జనాభాకు సరిపడా తిండిపెట్టలేక పోతున్నాం. కనీస వసతులు కల్పించలేకపోతున్నాం. విద్య,వైద్యం అందించలేకపోతున్నాం. దేశం అభివృద్ధి చెందాలంటే కనీస వసతులు కలగాలి. పాలకులు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి. ప్రజలు కూడా తమ హక్కులతో పాటు బాధ్యతలను విస్మరించకూడదు. ఒకవైపు జవాబుదారీ పాలన, మరోవైపు బాధ్యతగల పౌరసమాజం ఉంటేనే నిజమైన ప్రగతి సాధ్యమవుతుంది. మనం ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తే, పాలిస్తే నష్టపోయేది రాష్ట్రమే. నష్టం జరిగేది ప్రజలకే తప్ప పాలకులకు కాదు. భారతదేశం ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశంగా ఎదిగింది. 145 కోట్ల జనాభాతో సతమతమవుతోంది. యువశక్తి, సహజ వనరులు, మేథో సంపత్తి, సాంకేతిక నైపుణ్యం వంటి అనేక బలాలు మనకు ఉన్నా, అడుక్కు తిన్నట్లుగా ప్రజల జీవితాలు సాగుతున్నాయి. విద్య, ఆరోగ్యం, పారిశుద్ధం, పర్యావరణం వంటి విషయాల్లో వెనకబడి ఉన్నాం. అవినీతి ఊడలు దిగుతోంది. దీనికి కారణం కేవలం పాలకుల వైఫల్యమే కాదు, ప్రజల నిర్లక్ష్యం కూడా ఓ కారణంగా చూడాలి. మనకెందుకులే అనుకుంటే ఇలాగే సాగదీస్తారు. దేశాభివృద్ధి అంటే కేవలం ప్రభుత్వ పథకాలు, భారీ ప్రాజెక్టులు మాత్రమే కాదు. ప్రతి పౌరుడి బాధ్యతా యుతమైన పాత్ర పోషించాలి. ప్రజాస్వామ్య దేశంలో పౌరస్పృహ లేకపోతే పాలకులు మనలను ఏమారుస్తారని గుర్తించాలి. ప్రజల సమస్యల కంటే రాజకీయ ప్రయోజనాలు, అధికారం నిలబెట్టుకోవడమే లక్ష్యంగా పాలన సాగిస్తున్న తీరును చూస్తున్నాం. అన్ని రాష్ట్రాల్లోనూ ఇదే తరహా పాలన సాగుతోంది. ఆదాయాలను మించి ఖర్చు చేస్తున్నారు. రాజకీయ నేతల జీత భత్యాలు తడిసి మోపెడు అవుతున్నాయి. సంపాదనే ధ్యేయంగా కొందరి పాలకుల ప్రధాన లక్ష్యంగా మారుతోంది. ప్రజాస్వామ్యంలో అధికారాన్ని ప్రజలే ఇస్తారు. కాబట్టి ప్రజల సంక్షేమం కోసం పనిచేయడం పాలకుల విధి. ప్రభుత్వాలు పారదర్శకంగా వ్యవహరించాలి. ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేయరాదు. కానీ నిత్యం జరుగుతున్నది దుర్వినియోగం తప్ప మరోటి కాదు. ప్రజల సమస్యలను వినడం, తెలుసుకోవడం, అభివృద్ధి ఫలాలు అందరికీ చేరేలా చూడడం అన్నది జరగడం లేదు. పాలనలో జవాబుదారీతనం లేకుండా పోతోంది. ఎన్నికల రోజున బలవంతంగా ఓటు వేసి ఐదేళ్లు మౌనంగా ఉండటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. ఇది మన కర్తవ్యాన్ని విస్మరించయడమే అవుతుంది. ప్రజా సమస్యలపై ప్రశ్నించడం, ప్రభుత్వ పనితీరును పరి శీలించడం, తప్పులను ఎత్తి చూపడం, మంచి కార్యక్రమాలను ప్రోత్సహించడం ప్రతి పౌరుడు బాధ్యతగా గుర్తించాలి. అధిక జనాభాతో సతమతం అవుతున్న మనం కనీస సౌకర్యలు లేనప్పుడు జనాభాను పెంచాలన్న పిలుపును వ్యతిరేకించాలి. ఉన్న పౌరులకు ఎలాంటి సౌకర్యాలు ఇస్తున్నారో అడగాలి. గర్భిణీలకు కనీస డెలివరీ సరిపడా ఆస్పత్రులు, వసతులు లేవన్న విషయం పాలకులకు గుర్తు చేయాలి. జనాభా పెరుగుదల అనర్థ హేతవు తప్ప అభివృద్ధి కాదని గుర్తిస్తే మంచిది.



# అయోధ్య చోరీలో కీలక ఆధారాలు సేకరణ

**● కరెన్సీని జేబులు, బూట్లల్లో దాచుకుని తరలింపు 70సార్లు ● దొంగతనం..చూసీచూడనట్లుగా అధికారులు ● సిసి టివి ఫుటేజ్ ఆధారాలను సుకరించిన సిట్**

**అయోధ్య,జూలై7:** అయోధ్య రామ మందిర విరాళాల చోరీ కేసులో కీలక ఆధారాలను సేకరించినట్లు సిట్ వెల్లడించింది. ఈ విషయంపై యూపీ ప్రభుత్వానికి నివేదిక అందించింది. ఏప్రిల్ 27 నుంచి జూన్ 5 వరకు విరాళాల లెక్కింపు చేపట్టిన వ్యక్తుల్లో కొందరు డబ్బులు అపహరించినట్లు సీసీటీవీ దృశ్యాల్లో తేలిందని పేర్కొంది. ఈ 39 రోజుల్లో లెక్కించే సమయంలో కొంతమంది సిబ్బంది కరెన్సీ నోట్ల కట్టలను, చిల్లరను తమ దుస్తులు, జేబులు, బూట్లలో దాచిపెట్టినట్లు సీసీటీవీ రికార్డుల్లో కనిపించిందని తెలిపింది. డబ్బును సిబ్బంది దొంగలిస్తున్నట్లు చూసిన కొందరు అధికారులు కూడా వారిని ఆపడానికి ప్రయత్నించలేదని సిట్ పేర్కొంది. నిందితులు దాదాపు 70 సార్లు దొంగతనాలకు పాల్పడినట్లు అధికారులు వెల్లడించారు. దర్యాప్తులో భాగంగా ట్రస్ట్ సభ్యులు, బ్యాంకు అధికారులు, భద్రతా సిబ్బంది, లెక్కింపు సిబ్బందిని విచారించామన్నారు. వారి వాంగ్మూలాల ప్రకారం ఏప్రిల్ 27కి ముందు కూడా విరాళాల చోరీ జరిగి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. పాత సీసీటీవీ ఫుటేజ్ అందుబాటులో లేకపోవడంతో ఈ విషయంలో ఆధారాలు సేకరించడం సవాలుగా మారిందన్నారు. మరిన్ని వివరాలు తెలుసుకునేందుకు ఐదేళ్ల ఖాతాలను రీఆడిట్ చేస్తున్నామని.. బ్యాంకు రికార్డులు, విరాళాల పత్రాలు, ఆలయ నిర్మాణ వ్యయాలు, బంగారం, వెండి వస్తువులతో సహా అన్ని ఆర్థిక లావాదేవీల రికార్డులు పరిశీలిస్తున్నామని తెలిపారు. దర్యాప్తులో భాగంగా ఆలయంలో భద్రతా తనిఖీలు, బయోమెట్రిక్ హాజరు, డిజిటల్ పరికరాలపై పరిమితులు, సీసీటీవీ పర్యవేక్షణ వంటి చర్యల్లో అనేక లోపాలు గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ లోపాలను వినియోగి ంచుకుని నిందితులు చోరీకి పాల్పడ్డారని తెలిపారు. విలువైన కానుకల నిర్వహణ, డాక్యుమెంటేషన్, తూకం వేయడం వంటి వాటిల్లోనూ పలు విధానపరమైన లోపాలు ఉన్నట్లు వెల్లడించారు. ఈ కేసులో అవినాష్ శుక్లా, అనుకల్ప్ మిశ్రా, లవ్‌కుష్ మిశ్రా, మనీష్ కుమార్ యాదవ్, కరుణెలిష్ పాండే, రామశంకర్ మిశ్రాలకు ప్రమేయం ఉన్నట్లు నిర్ధరించారు. సీసీటీవీ దృశ్యాల్లో అవినాష్ శుక్లా, మనీష్ కుమార్ యాదవ్‌లు పలుమార్లు నగదు, నగలను అపహరిస్తున్నట్లు రికార్డ్ అయ్యిందని పేర్కొన్నారు.

# ప్రశ్నపై 'ఉపా' ఉచ్చు

పాలకుల తప్పులను ఎండగట్టడం, ప్రజల పక్షాన నిలబడి నిలదీయడం జర్నలిజం ప్రాథమిక ధర్మం. కానీ నేడు ఆ ధర్మాన్ని నిర్వర్తించడమే అతిపెద్ద నేరంగా మారిపోయింది. స్వతంత్రంగా వ్యవహరిస్తూ, పాలకులకు నచ్చని నిజాలను రాసే జర్నలిస్టులను టార్గెట్ చేస్తూ ప్రభుత్వాలు సాగిస్తున్న నిర్బంధకాండ ప్రజాస్వామ్య వ్యవస్థలనే ప్రమాదంలోకి నెడుతోంది. ఇటీవలి కాలంలో దేశంలో జర్నలిస్టులపై, సామాజిక కార్యకర్తలపై యథేచ్ఛగా 'ఉపా' వంటి కఠిన చట్టాలను ప్రయోగించడం ఈ ధోరణికి పరాకాష్ట. విమర్శిస్తే చాలు... అక్రమ కేసులు, అర్ధరాత్రి అరెస్టులు, నిరంతర వేధింపులతో జర్నలిస్టులను లొంగదీసుకునే ప్రయత్నాలు కోకొల్లలు. దీనివెనుక స్పష్టమైన రాజకీయ కోణం దాగుంది. ప్రశ్నకోసమే పార్టీ పెడుతున్న అన్న ఏపీ ఉపముఖ్యమంత్రి ఆ ప్రశ్ననే తట్టుకోలేకపోతే ఎలా? మొన్నటికి మొన్న ప్రొఫెసర్ నాగేశ్వర్, ఇప్పుడూ తెలంగాణకు చెందిన జర్నలిస్టులు, కేవీఆర్, ప్రశ్న రావణ్ వంటి వారిపై ఏపీలో 'ఉపా' కేసులు బనాయించడం ఈ అణచివేత ధోరణికి ప్రత్యక్ష ఉదాహరణలు. ఇది కేవలం ఒక వ్యక్తిని జైల్లో పెట్టడం మాత్రమే కాదు, ప్రశ్నించే ప్రతి గొంతుకను భయభ్రాంతులకు గురిచేసే ఒక వ్యవస్థీకృత కుట్ర.ఏపీలో సాయికృష్ణ హత్య, క్రాంతికుమార్ ఆత్మహత్య, ఆడపిల్లలపై లైంగికదాడుల వంటి అనేక ఘటనలు జరుగుతుంటే వాటిపై చర్యలకు ఉపక్రమించకుండా... గతంలో ఎన్నడూ లేని విధంగా, కేవలం వార్తలు రాసి నందుకు, సోషల్ మీడియాలో అభిప్రాయాలు పంచుకున్నందుకు జర్నలిస్టులపై దేశద్రోహం వంటి అత్యంత కఠినమైన చట్టాలను ప్రయోగించడం నిత్యకృత్యమైపోయింది. అదే సందర్భంలో రావణ్ విమర్శను తప్పుపట్టిన పవన్ కళ్యాణ్, కేసుపెట్టిన రాధామనోహర్‌లు వాడిన భాష సంగతేంటి? ఒక్కరిని కఠినంగా శిక్షిస్తే, మిగతా వంద మంది భయపడి పాలకుల తప్పులను రాయడం మానేస్తారనేది ప్రభుత్వాల దుష్ట ఆలోచన. అందుకే, పెద్ద మీడియా సంస్థలు చాలావరకు పాలకుల భజన బృందాలలో చేరిపోయాయి. క్షేత్రస్థాయిలో నిజాయితీగా పనిచేసే స్వతంత్ర జర్నలిస్టులు,



యూట్యూబ్ జర్నలిస్టులు, చిన్న పత్రికల ప్రతినిధులు తీవ్రమైన అణచివేతకు గురవుతున్నారు. కార్మిక, శ్రామిక వర్గాల సమస్యలను, రైతుల, గ్రామీణ ప్రజల ఆవేదనను వెలుగులోకి తెచ్చే జర్నలిస్టులను ఉగ్రవాదులుగా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే శక్తులుగా చిత్రీకరించడం పాలకుల ఫాసిస్టు ధోరణికి అద్దం పడుతోంది. నిజాలు మాట్లాడే నోళ్లను నొక్కేయడం ద్వారా తాము చేసే ప్రతి అక్రమాన్ని చట్టబద్ధం చేసుకోవచ్చని పాలకులు భావిస్తున్నారు. అయితే, చరిత్రలో ఏ శక్తీ నిర్బంధం ద్వారా సత్యాన్ని శాశ్వతంగా దాచలేకపోయింది. స్వేచ్ఛ అనేది అపరిమిత హక్కు కాదు. అదే సమయంలో చట్టాల పేరుతో ప్రజాస్వామ్య విమర్శలను అణచివేయడం కూడా సమర్థనీయం కాదు. అసత్య ప్రచారాన్ని చట్టబద్ధంగా ఎదుర్కొనే మార్గాలు అనేకం. వాస్తవాలను ప్రశ్నించే స్వరాలను కూడా అదే గాటన కట్టేస్తే ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజల విశ్వాసం దెబ్బ తింటుంది. ప్రశ్నించిన ప్రతి ఒక్కరినీ ప్రత్యర్థిగా చూడడం, ప్రతి విమర్శను కుట్రగా చిత్రీకరించడం ప్రజాస్వామ్య సంస్కృతిని బలహీనపరుస్తుంది. ప్రజాస్వామ్యంలో ప్రశ్న శత్రువు కాదు, అదొక అద్దం. అందులో కనిపించే లోపాలను సరిదిద్దు కోవడం పాలకుల పరిణతి. అలా కాకుండా ఆ అద్దాన్నే పగలగొట్టాలని ప్రయత్నించడం బలానికి కాదు, అసహనానికి సంకేతం. ప్రస్తుతం దేశంలో జరుగుతోందిదే.న్నటికి నిన్న ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా శాంతియుతంగా నిరసనలు తెలపడం లేదా ధర్నాలు చేయడం అనేది పౌరుల ప్రాథమిక హక్కు అని ముంబై హైకోర్టు స్పష్టం చేసింది. అంతకు ముందు ఢిల్లీలో సీఏఏ వ్యతిరేక ఆందోళన వార్తలను, రైతుల ఉద్యమం విశేషాలను 'న్యూస్‌క్లిక్' నిరంతరంగా ప్రచురించింది. అధికార శ్రేణులకు మింగుడుపడని మరెన్నో అంశాల్ని వెలుగులోకి తెచ్చింది. దీంతో అధికారపార్టీ ప్రబీర్ పురకాయస్థపై కక్ష కట్టింది. ఢిల్లీ ప్రత్యేక పోలీసు విభాగాన్ని సోదాలకు పంపింది. ఆయనపై 'ఉపా' కేసు పెట్టింది. ఆధారాలు చూపడంలో విఫలమయ్యారంటూ పోలీసులకు సర్వోన్నత న్యాయస్థానం తలంటు పోసింది. అరెస్టు చెల్లదని స్పష్టమైన తీర్పునిచ్చింది. ఢిల్లీకి చెందిన విద్యార్థి నాయకుడు, సామాజిక కార్యకర్త ఉమర్ ఖలీద్‌పై ఉపా చట్టం కింద కేసు నమోదు చేసి, విచారణ పేరుతో ఆరేండ్లుగా జైల్లో ఉంచడం దేశ వ్యాప్తంగా ఇప్పటికీ చర్చనీయాంశమే. నిర్దిష్టమైన ఆధారాలు లేకుండా, కేవలం భిన్నాభిప్రాయాలను వ్యక్త పరిచినందుకు ఇలాంటి క్రూరమైన చట్టాలను ప్రయోగించడం పౌర హక్కుల హరణమే అవుతుంది. ఇక్కడ శిక్ష కంటే విచారణే ఒక పెద్ద శిక్షగా మారుతున్న దుస్థితి. ఇలా చెప్పుకుంటూ పోతే జర్నలిస్టులపై డజన్ల కొద్దీ కేసులను ఉదహరించవచ్చు. అసలు అభియోగాలే లేకుండా ఇప్పటికీ ఎందరో జైళ్లలో మగ్గుతున్నారు.ప్రజాపక్షం వహించే జర్నలిజాన్ని నియంత్రించడానికే ప్రభుత్వాలు ఈ చట్టాలను ఉపయోగిస్తున్నాయని ఇది స్పష్టంగా సూచిస్తోంది. ఈ నేపథ్యంలో పత్రికా స్వేచ్ఛ కోసం, నిజమైన జర్నలిజం కోసం పాత్రికేయ సమాజం మాత్రమే కాదు, పౌరసమా జమూ సమాయత్తం కావాలి. లేకపోతే ప్రజాస్వామ్య సౌధమైన నాలుగోస్తంభం కూలిపోతుంది.

# నెలాఖరులో వర్షాకాల శాసనసభా సమావేశాలు

**సన్నాహాల్లో అధికారులు**

**పలు అసెంబ్లీ కమిటీల నియామకం**

**సెలెక్ట్ కమిటీ చైర్మెన్‌గా మంత్రి పొన్నం ప్రభాకర్**

**హైదరాబాద్:** తెలంగాణ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు త్వరలోనే ప్రారంభం కానున్నాయి. వీటి నిర్వహణకు సర్కారు సన్నద్ధమవుతున్నది. ఈనెలాఖరులో గానీ, ఆగస్టు తొలి వారంలో గానీ ఈ సమావేశాలు చేపట్టేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. శాసన మండలి, శాసనసభ భవనాలకు సంబంధించి కొన్ని మరమ్మతులు, మరికొన్ని సుందరీకరణ పనులు జరుగుతున్న విషయం తెలిసిందే. గతంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించినట్టుగా అసెంబ్లీలో సెంట్రల్ హాల్‌ను నిర్మించే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇదిలావుండగా అసెంబ్లీ భవనం సొంతం పునరుద్ధరిస్తున్నారు. వర్షాకాల అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో అవసరమైన చర్యలకు శ్రీకారం చుట్టారు. ముఖ్యమంత్రి, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి సైతం ఈ విషయమై సమాలోచనలు చేస్తున్నారు. సమావేశాలు చేపడితే ఎప్పటి నుంచి, ఎన్నిరోజులు అనే విషయపై ఇంకా స్పష్టత లేదు. సమావేశాలు ప్రారంభమైన తర్వాత బీఏసీ భేటీలోనే ఎన్ని రోజులు సమావేశాలు నిర్వహించాలనే సంగతిపై స్పష్టత రానుంది. సోమవారం హైదరాబాద్‌లోని అసెంబ్లీలో మీడియా సలహామండలి కార్యాలయాన్ని ప్రారంభించారు. అలాగే కొత్త విప్‌లు వేముల వీరేశం, అద్దంకి దయాకర్, బల్మూర్ వెంకట్‌కు అసెంబ్లీ ప్రాంగణంలో కొత్తగా చాంబర్లను కేటాయించారు. వారు ఇక నుంచి ఆయా కార్యాలయాల నుంచి పని చేస్తారు. వర్షాకాల అసెంబ్లీ సమావేశాలు కేవలం వారం రోజులు మాత్రమే నిర్వహించేందుకు చర్చోపచర్చలు సాగుతున్నాయి. ఇదిలావుండగా ప్రతియేటా నియమించే అసెంబ్లీ కమిటీలను ప్రభుత్వం ప్రకటించింది. ఈమేరకు శాసనసభ కార్యదర్శి రెండ్ల తిరుపతి, శాసనమండలి కార్యదర్శి డాక్టర్ నర్సింహ్మాచార్యులు ఆదేశాలు జారీ చేశారు. సెలెక్ట్ కమిటీ చైర్మెన్‌గా రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నియమితులయ్యారు. ?ఈ కమిటీలో ఎమ్మెల్యేలు బాలునాయక్, లక్ష్మీకాంతరావు, జి మధుసూదన్‌రెడ్డి, కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి, డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, మామిడాల యశస్విని, దానం నాగేందర్, కోవా లక్ష్మి, కె.మాణిక్‌రావు, శ్రీరామ్ రావు అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల, కూనంనేని సాంబశివరావు ఉన్నారు. సబార్డినేట్ లేజిస్టేషన్ కమిటీ చైర్మెన్‌గా కడియం శ్రీహరితోపాటు మరో 10 మంది సభ్యులను నియమించారు. అలాగే సదుపాయాల కమిటీ చైర్మెన్ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌తోపాటు మరో 10 మంది ఎమ్మెల్యేలను నియామకం చేశారు. ఎస్సీల సంక్ష?మ కమిటీ చైర్మెన్‌గా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ఎస్టీ సంక్ష?మ కమిటీ చైర్మెన్‌గా పాయం వెంకటేశ్వర్లు, బీసీ సంక్ష?మ కమిటీ చైర్మెన్‌గా మక్కన్ సింగ్ రాజ్‌ఠాకూర్, గ్రంథాలయ కమిటీ చైర్మెన్‌గా మట్టా రాగమయి, మహిళా, శిశు, వికలాంగుల కమిటీ చైర్మెన్‌గా చిట్టెం పర్ణికారెడ్డి, మైనార్టీల సంక్ష?మ కమిటీ చైర్మెన్ లక్ష్మి కాంతరావు, వైల్డ్‌లైఫ్, పర్యావరణ కమిటీ చైర్మెన్‌గా స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ వ్యవహరించనున్నారు. కాగా పిటిషన్ల కమిటీ, ప్రివిలేజేస్ కమిటీ చైర్మెన్‌గా స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ప్రభుత్వ హామీల కమిటీ చైర్మెన్‌గా పట్లోళ్ల సంజీవరెడ్డి, రూల్స్ కమిటీ చైర్మెన్‌గా స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఎథిక్స్ కమిటీ చైర్మెన్‌గా రేవూరి ప్రకాష్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ కమిటీల పదవీకాలం ఏడాది ఉంటుంది. లేదా కొత్త కమిటీలు ఏర్పాటయ్యే వరకు పాతవే పనిచేస్తాయని అసెంబ్లీ వ్యవహారాలు చూసే అధికారులు చెప్పారు. **రాజ్యసభ ఎథిక్స్ కమిటీ రాక** రాజ్యసభ ఎథిక్స్ కమిటీ చైర్మెన్, ఇద్దరు సభ్యులు సోమవారం తెలంగాణ అసెంబ్లీని సందర్శించారు. చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనసభా వ్యవహారాల మంత్రి డి శ్రీధర్‌బాబుతో భేటీ అయ్యారు. దాదాపు రెండు గంటలపాటు వీరి మధ్య సమావేశం జరిగింది.


# అయోధ్య విరాళాల కేసు: షూస్, దుస్తుల్లో నోట్ల కట్టలు దాచి చోరీ- సిట్ విచారణలో సంచలన నిజాలు



**అయోధ్య :** అయోధ్య ఆలయ విరాళాల చోరీ ఉదంతం దేశ వ్యాప్తంగా ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ వ్యవ హారంపై దర్యాప్తు జరుపుతున్న ఉన్నత స్థాయి ప్రత్యేక దర్యాప్తు బృందం () సమర్పించిన ప్రాథమిక నివేదికలో దిగ్భ్రాంతికరమైన విషయాలు వెలుగుచూశాయి. విరాళాల కౌంటింగ్ రూమ్‌లో పనిచేసే సిబ్బంది అత్యంత చాకచక్యంగా నోట్ల కట్టలను తమ దుస్తులు, జేబులు, షూస్. వ్యక్తిగత వస్తువుల్లో దాచి బయటకు తరలించినట్లు సిట్ నిర్ధారించింది. లఖ్‌నవూ డివిజనల్ కమిషనర్ విజయ్ విశ్వాస్ పంత్, ఐజీ కిరణ్ ఎస్, ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి నీల్ రతన్‌లతో కూడిన త్రిసభ్య సిట్ బృందం ఆలయ కౌంటింగ్ రూమ్‌కు సంబంధించిన భద్రతపై లోతైన దర్యాప్తు చేపట్టింది. ఏప్రిల్ 27 నుంచి జూన్ 5 వరకు రికార్డైన సీసీటీవీ ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలించారు. సిబ్బంది నగదును మాయం చేస్తున్న సుమారు 70 అనుమానాస్పద ఘటనలు కెమెరాలకు చిక్కాయి. ఇది ఏదో ఒక రోజు అనుకోకుండా జరిగిన పొరపాటు కాదని, ఒక క్రమపద్ధతిలో సాగిన సుదీర్ఘ దొంగతనమని సిట్ తన ప్రాథమిక నివేదికలో పేర్కొంది. లెక్కింపు సిబ్బంది కరెన్సీ కట్టలను తమ జేబుల్లో, బూట్లలో కుక్కుకుంటూ, మరికొన్ని నోట్లను కౌంటింగ్ రూమ్‌కు అనుబంధంగా ఉన్న వాష్ రూమ్‌లలో దాచినట్లు సీసీటీవీల ద్వారా సిట్ అధికారులు గుర్తించారు. భద్రతా లోపాలతోనే వారికి అవకాశంరామాలయ ప్రాంగణంలో భద్రతా లోపాలను సిట్ అధికారులు గుర్తించారు. ఆ లోపాలే చోరీకి అవకాశాన్ని ఇచ్చాయని అధికారులు గుర్తించారు. రామాలయ ప్రాంగణంలో అమలు కావాల్సిన నిర్వహణ విధానాలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని దర్యాప్తులో తేలింది. కౌంటింగ్ హాల్ లోపలికి వచ్చేటప్పుడు, బయటకు వెళ్లేటప్పుడు సిబ్బందిని శారీరకంగా తనిఖీ చేసే సరైన వ్యవస్థ లేదని గుర్తించారు. ఉద్యోగులు తమ వ్యక్తిగత బ్యాగులు, ఇతర వస్తువులను యథేచ్ఛగా కౌంటింగ్ ఏరియాలోకి తీసుకెళ్లినా ఎవరూ అడ్డుకోలేదని తెలిసింది. విభిన్న హుండీల నుంచి వచ్చిన నగదును విడివిడిగా లెక్కించకుండా, అంతా కలిపి ఒకేసారి లెక్కించడం వల్ల ఎంత సొమ్ము వచ్చిందనే దానిపై స్పష్టత లోపించింది. దీన్నే నిందితులు అనుకూలంగా మార్చుకున్నన్నట్లు సమాచారం. అనుమానితులైన కొందరు ఉద్యోగుల బ్యాంకు ఖాతాలను పరిశీలించగా, వారి అధికారిక ఆదాయ వనరుల కంటే విపరీతమైన నగదు డిపాజిట్లు, లావాదేవీలు జరిగినట్లు ఎస్ఐటీ గుర్తించింది. అందులో వాస్తవం లేదు: సిట్‌ఈ కేసులో ప్రాథమిక ఆధారాలను బట్టి అవినాష్ శుక్లా, అనుకూల్ మిశ్రా, లవ్‌కుష్ మిశ్రా, మనీష్ కుమార్ యాదవ్, కరుణేష్ పాండే, రామ్‌శంకర్ మిశ్రా సహా మొత్తం ఆరుగురు కీలక నిందితులను సిట్ గుర్తించింది. ఇప్పటివరకు ఈ వ్యవహారంలో ఎనిమిది మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. దర్యాప్తుకు ముందే కొందరు ఉద్యోగుల నుంచి రూ. 78.94 లక్షలను రికవరీ చేయగా, జూన్ 4వ తేదీన కౌంటింగ్ రూమ్ బాత్‌రూమ్ నుంచి మరో రూ. 2.25 లక్షల సొమ్మును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మొత్తంగా రూ.81 లక్షలకు పైగా నగదు రికవరీ అయింది. అయితే, సోషల్ మీడియాలో ప్రచారమవుతున్నట్లుగా వెండి ఇటుకలు, ఆభరణాలు మాయమయ్యాయనే ఆరోపణల్లోవిపరీతమైన నగదు డిపాజిట్లు, లావాదేవీలు ఎలాంటి నిజం లేదని, దానికి ఎలాంటి ఆధారాలు లభించలేదని సిట్ స్పష్టం చేసింది. ఈ దొంగతనం ఉదంతంతో విపక్షాల నుంచి తీవ్ర విమర్శలు వచ్చాయి. దీంతో పర్యవేక్షణ లోపానికి నైతిక బాధ్యత వహిస్తూ జనరల్ సెక్రటరీ చంపత్ రాయ్, ట్రస్టీ అనిల్ మిశ్రా తమ పదవులకు రాజీనామా చేశారు. ట్రస్ట్ రాజ్యాంగం ప్రకారం రాజీనామాలు సమర్పించిన వెంటనే అవి అమలులోకి వస్తాయని సీనియర్ ట్రస్టీ కె. పరాశరన్ తెలపడంతో వాటిని ఆమోదించారు. చంపత్ రాయ్ స్థానంలో ఆర్‌ఎస్‌ఎస్ నేత, మాజీ ఐఎఫ్‌ఎస్ అధికారి కృష్ణ మోహన్‌ను తాత్కాలిక జనరల్ సెక్రటరీగా నియమించారు. ప్రత్యేక ఆహ్వానిత సభ్యుడైన గోపాల్ నగర్‌కోటెను జాబితా నుంచి తొలగించారు.

# ఎన్‌డీయేలోకి శరద్‌పవార్ ఎన్సీపీ.. మహారాష్ట్రలో కాంగ్రెస్‌కు షాక్ తప్పదా

**మహారాష్ట్ర:** రాజకీయాల్లో మరో సంచలనం జరగబోతుందా..? ఇప్పటివరకు ప్రతిపక్ష కూటమిలో ఉన్న శరద్ పవార్ ఎన్సీపీ (ఎస్పీ).. ఇప్పుడు ఎన్‌డీయేలో చేరే అవకాశాలున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇటీవలి కాలంలో శరద్ పవార్ ఎన్సీపీ సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో తన పార్టీని బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్‌డీయేలో కలపాలని శరద్ పవార్ ఆలోచిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం మహారాష్ట్రలో బీజేపీ ఆధ్వర్యంలోని మహాయుతి కూటమి అధికారంలో ఉంది. ఇందులో బీజేపీతోపాటు షిండే శివసేన, అజిత్ పవార్ ఎన్సీపీ భాగస్వాములుగా ఉన్నాయి. ప్రతిపక్ష మహా వికాస్ అఘాడి (ఎంవీయే)లో కాంగ్రెస్, ఉద్ధవ్ వర్గం శివసేన, శరద్ పవార్ వర్గం ఎన్సీపీ సభ్యులుగా ఉన్నాయి.అయితే, వరుస ఓటములు, మరోవైపు ఎంవీయేకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు బీజేపీలోని ఎన్‌డీయేవైపు, మహాయుతి కూటమివైపు చూస్తున్నారు. ఉద్ధవ్ శివసేనకు సంబంధించి మీటింగ్‌కు ఆ పార్టీ ఎమ్మెల్యేలు హాజరు కాలేదు. ఆ పార్టీ ఎంపీలు షిండే వర్గంలో చేరారు. ఇదే పరిస్తితి శరద్ పవార్ ఎన్సీపీలో కూడా కనిపిస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో తన పార్టీ మనుగడ కష్టమని భావించిన శరద్ పవార్.. తన పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసేందుకు ప్రయత్నించారు. కానీ, కాంగ్రెస్ పార్టీలోని నేతల నుంచి సరైన మద్దతు లభించలేదు. దీంతో ఆయన ఇప్పుడు ఎన్‌డీయేలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారన్న చర్చ జరుగుతోంది. 2024 ఎన్నికల సమయంలోనే తన పార్టీని కాంగ్రెస్‌లో కలపాలని శరద్ పవార్ భావించారు. ఈ విషయంపై కాంగ్రెస్ పెద్దలతో చర్చించారు. అయితే, ఎన్నికల తర్వాత దీనిగురించి చర్చిద్దాం అని అప్పట్లో వాయిదావేశారు. తర్వాత మరోసారి శరద్ పవార్.. కాంగ్రెస్ పెద్దలతో విలీన ప్రతిపాదన తెచ్చారు. వారు మహారాష్ట్ర కాంగ్రెస్ నేతలతో చర్చించారు. కానీ, వారు ఎన్సీపీ తమ పార్టీలో చేరడాన్ని వ్యతిరేకించారు. ఎన్సీపీ తమ పార్టీలో విలీనమైతే తమకు ప్రాధాన్యం తగ్గుతుందని భావించారు. ప్రతిపాదన ముందుకు కదల్లేదు..



# దేశవ్యాప్తంగా 58 ఇంజనీరింగ్ కాలేజీల మూసివేత.



**న్యూ ఢిల్లీ :** దేశవ్యాప్తంగా గత ఏడాది 58 ఇంజనీరింగ్ కాలేజీలను యాజ మాన్యాలు మూసేశాయి. దీనికి సంబంధించి ఆయా కాలేజీలకు ప్రభుత్వం కూడా అనుమతిం చింది. ఈ విషయాన్ని ఏఐసీటీఈ (ది ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్) తాజాగా వెల్లడించింది. ఏఐసీటీఈ అను మతితో 2025-26లో దేశవ్యాప్తంగా 58 ఇంజనీరింగ్ కాలేజీలు మూసివేశారు. ఈ 58 కాలేజీల్లో మూడు ప్రభుత్వ ఎయిడెడ్ కాలేజీలుకాగా, మిగతావి ప్రైవేటు కాలేజీలు. కాలేజీల మూసివేతకు యాజమాన్యాలు చేసుకున్న దరఖాస్తులతో ఈ అనుమతి లభించింది. దీని ప్రకారం ఈ 58 కాలేజీలు 2025-26 విద్యా సంవత్సరం నుంచి ఫస్ట్ ఇయర్‌లో కొత్త అడ్మిషన్లు తీసుకోలేదు.కానీ, అప్పటికే కొనసాగుతున్న విద్యార్థులకు సంబంధించి వారి అకమిక్ కోర్సులు పూర్తయ్యే వరకు కాలేజీలు కొనసాగుతాయి. అంటే, సెకండియర్, థర్డ్ లేదా ఫైనలియర్ చదువుతున్న విద్యార్థుల పూర్తి కోర్సు పూర్తయ్యే వరకు కాలేజీలు పని చేస్తాయి. ఈ విషయంలో విద్యార్థుల భద్రతకు, భవిష్యత్తుకు ఆయా కాలేజీలు గ్యారెంటీ ఇవ్వాల్సిందే. అవసరమైతే విద్యార్థుల్ని మరో కాలేజీకి బదిలీ చేస్తారు. ఈ విషయంలో ఏఐసీటీఈ వారికి అండగా ఉంటుంది. ఆయా కాలేజీల్లో కోర్సులు పూర్తయ్యేలా చూస్తుంది. కొంతకాలంగా కాలేజీల్లో సరైన అడ్మిషన్లు లేకపోవడం, అలాగే, ప్రస్తుతం అకడమిక్ ప్రమాణాలు, మౌలిక వసతుల ప్రమాణాలకు అనుగుణంగా కాలేజీలు నిర్వహించలేనందున వాటిని మూసేస్తున్నట్లు ఆయా కాలేజీల యాజమాన్యాలు తమ అభ్యర్థనల్లో పేర్కొన్నాయి. ఈ ప్రక్రియను ఏఐసీటీఈ.. ప్రగతిశీల మూసివేతగా పేర్కొంది. మరోవైపు 2025-26 విద్యా సంవత్సరంలో దేశవ్యాప్తంగా 950కిపైగా టెక్నికల్, ఇంజనీరింగ్ కోర్సులు రద్దయ్యాయి.

# 24 గంటల్లో 600 మిల్లీమీటర్ల వర్షం- వరదలతో దెబ్బతిన్న నిర్మాణాలు, వాహనాలు

**జమ్మూకశ్మీర్:** దేశంలో పలుచోట్ల వర్షాలు దంచికొడుతు న్నాయి. ముఖ్యంగా ముంబయి, జమ్మూకశ్మీ ర్‌లో భారీ వర్షాల దాటికి రోడ్లు జలమయమ య్యాయి. కొన్ని చోట్ల ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. భారీ వర్షాల నేపథ్యంలో నాసిక్‌లో హై అలర్ట్ ప్రకటించారు. ప్రభావిత ప్రాంతాల్లో పాఠశాలలు మూసివేశారు. త్రయంబకేశ్వర్ ఆలయంలో దర్శనాలు నిలిపివేశారు. అలాగే, హిమాచల్ ప్రదేశ్‌లోని కొన్ని జిల్లాలకు భారత వాతావరణ శాఖ హెచ్చరికి జారీ చేసింది. తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అది కారులు సూచించింది.జమ్మూకశ్మీర్‌లోని దోడా జిల్లాలో మంగళవారం థత్రి పట్టణ ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో ఆయా ప్రాంతాల్లో ఆకస్మిక వరదలు సంభవించాయి. గతరెండ్రోజుల్లో ఆకస్మిక వరదలు రావడం ఇది మూడోసారని అధికా రులు తెలిపారు. ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు థత్రి పట్టణంలోకి బండరాళ్లు, బురద, శిథిలాలు కొట్టుకువచ్చాయన్నారు. దీంతో పలు ఇళ్లు, దుకాణాలు, వాహనాలు పాక్షికంగా దెబ్బతిన్నాయని తెలిపారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని అధికారులు తెలిపారు. భారీ వర్షాల కారణంగా అనేక వాహనాలు శిథిలాల కింద కూరుకుపోగా, మరికొన్ని వాహనాలు ఆకస్మిక వరదలో కొట్టుకుపోయి చినాబ్ నదిలోకి చేరాయని స్థానికులు పేర్కొన్నారు. ప్రభావితమైన వాహనాల సంఖ్య, మొత్తం నష్టం ఎంత అనేది ఇంకా అధికారికంగా అంచనా వేయాల్సి ఉంది. మరోవైపు, ఆకస్మిక వరదల కారణంగా థత్రి వద్ద దోడా-కిష్త్వార్ జాతీయ రహదారి మూసుకుపోయింది. దీంతో ఆ ప్రాంతంలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వెంటనే రంగంలోకి దిగిన అధికార యంత్రాంగం సహాయక చర్యలను చేపట్టింది. ప్రస్తుతం వరద ప్రభావిత ప్రాంత ప్రజలు సురక్షితంగా ఉన్నారని అధికారికంగా ఎలాంటి మరణాలు నమోదు కాలేదని తెలిపారు.రైళ్ల రాకపోకలకు అంతరాయంఇక, మహారాష్ట్రలోని పలు జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షానికి జనజీవనం స్తంభించిపోయింది. ప్రధానంగా పుణెలోని ప్రధాన హిల్‌స్టేషన్ లోనావాలోలో ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు 24 గంటల వ్యవధిలో అక్కడ 670 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఈ కారణంగా కర్జాత్-లోనావాలా ఘాట్ సెక్షన్లలో కొండ చరియలు విరిగిపడినట్లు తెలిపారు. ఈ క్రమంలో గత రెండ్రోజులుగా ఈ మార్గంలో రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడిందన్నారు.పర్యాటక ప్రదేశాల్లోకి వెళ్లడంపై నిషేధంగత 48 గంటల్లో పుణెజిల్లా వ్యాప్తంగా ఏకంగా 22 చోట్ల కొండచరియలు విరిగిపడ్డాయని అధికారులు తెలిపారు. భోర్ ఘాట్‌లోని ఠాకూర్వాడి సమీపంలో తొలుత కొండచరియలు విరిగిపడటంతో మూడు లైన్లపై ప్రభావం పడిందని చెప్పారు. తర్వాత మంకీ హిల్, ఖండాలా మధ్య మరోచోట కూడా ఇదే పరిస్థితి తలెత్తిందన్నారు. తీవ్రంగా దెబ్బతిన్న ట్రాక్‌ల పునరుద్ధరణ పనులు వేగంగా జరుగుతున్నా యని అధికారులు తెలిపారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, మహారాష్ట్రలోని థానే జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. కోటలు, జలాశయాలతో సహా అన్ని పర్యాటక ప్రదేశాల్లోకి ప్రవేశాన్ని నిషేధించింది.ముం బయి, గోవా రహదారిపై రవాణా పునఃప్రారంభంఇదిలా ఉండగా, సోమవారం ముంబయి, గోవా రహదారిపై కొండచరియలు విరిగిపడడంతో ఆ ప్రాంతంలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో అధికారులు యుద్ధ ప్రాతిపదికన భద్రతా చర్యలు పూర్తి చేయడంతో మంగళవారం వాహనాలు రవాణా పునఃప్రారంభమైంది. అయితే, భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్? ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అనవసర ప్రయాణాలు చేయవద్దని, ట్రాఫిక్? సూచనలను పాటించాలని కోరారు. ఇదిలా ఉండగా, రైల్వే ట్రాక్‌లపై బండరాళ్లు పడగా, భారీ కొండచరియలు విరిగిపడటంతో ముంబయి-పుణె ఎక్స్‌ప్రెస్ వే, పాత ముంబయి-పుణె హైవేపై కూడా ట్రాఫిక్‌ను నిలిపివేశారు.



# మోదీకి ఇండోనేసియా అత్యున్నత పౌర పురస్కారం- బ్రహ్మోస్‌తో సహా 20 కీలక ఒప్పందాలు ఖరారు



**న్యూ ఢిల్లీ :** భారత్, ఇండోనేషియా మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలోపేతమైంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో మధ్య జకార్తాలో జరిగిన ద్వైపాక్షిక చర్చల్లో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇండోనేషియా సైన్యానికి భారత్ అత్యాధునిక బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణులను సరఫరా చేయడంతో పాటు సముద్ర భద్రత, కీలక ఖనిజాల సరఫరా వ్యవస్థ, రక్షణ రంగ సహకారాన్ని విస్తరించేందుకు ఇరు దేశాలు అంగీకరించాయి. అలాగే ఈ పర్యటన సందర్భంగా ప్రధాని మోదీ అరుదైన గౌరవం లభించింది. ప్రధానికి ఇండోనేషియా అత్యున్నత పౌర పురస్కారాన్ని ప్రదానం చేశారు. 20 ఒప్పందాలపై సంతకాలుసమావేశం అనంతరం ఇరు దేశాలు దాదాపు 20 అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేశాయి. కీలక ఖనిజాలు, సాంకేతికత, ఆహార భద్రత, ఔషధ రంగం, సముద్ర భద్రత, వాణిజ్యం, పారిశ్రామిక సహకారం వంటి రంగాల్లో భాగస్వామ్యాన్ని మరింత విస్తరించేందుకు ఈ ఒప్పందాలు దోహదం చేయనున్నాయి. ప్రపంచ స్వచ్ఛ ఇంధన రంగానికి అవసరమైన ఉక్కు, నికెల్, అరుదైన ఖనిజాల ఉత్పత్తిలో ఇండోనేషియా కీలక దేశంగా ఉంది. ఈ నేపథ్యంలో అక్కడ ఉక్కు, నికెల్, రేర్ ఎర్త్ శాశ్వత అయస్కాంతాల తయారీ రంగాల్లో భారత్ పెట్టుబడులు పెట్టాలని నిర్ణయించింది. దీనివల్ల భారత పరిశ్రమలకు అవసరమైన కీలక ఖనిజాల సరఫరా మరింత బలపడనుంది.బ్రహ్మోస్, అస్త్ర క్షిపణులపై సహకారంభారత్ తయారు చేసిన బ్రహ్మోస్ క్షిపణులను ఇండోనేషియాకు సరఫరా చేయాలని నిర్ణయించారు. అలాగే 'ఆపరేషన్ సిందూర్' సందర్భంగా భారత్ అభివృద్ధి చేసిన 'అస్త్ర' గగనతల క్షిపణుల పనితీరుతో ఆకర్షితమైన ఇండోనేషియా వాటిని కూడా కొనుగోలు చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. దీంతో ఇరు దేశాల మధ్య రక్షణ సహకారం కొత్త దశలోకి అడుగుపెట్టనుంది. వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైన సబాంగ్ పోర్టును సంయుక్తంగా అభివృద్ధి చేయాలని భారత్, ఇండోనేషియా నిర్ణయించాయి. మలక్కా జలసంధిని ఆనుకుని ఉన్న ఈ పోర్టు, భారత్ గ్రేట్ నికోబార్ పోర్టు ప్రాజెక్టుకు సుమారు 100 మైళ్ల దూరంలో ఉండటంతో వ్యూహాత్మక ప్రాధాన్యం సంతరించుకుంది. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో సముద్ర భద్రత, వాణిజ్య రవాణా బలోపేతానికి ఇది ఉపయోగపడనుంది. ఇండోనేషియా చెల్లింపుల వ్యవస్థతో భారత యూపీఐని అనుసంధానించేందుకు ఇరు దేశాలు అంగీకరించాయి. దీని వల్ల వ్యాపార లావాదేవీలు, పర్యాటకుల చెల్లింపులు మరింత సులభతరం కానున్నాయి. అలాగే ఇండోనేషియాలో భారతీయ నిర్వహణ విద్యాసంస్థ ఐఐఎం-బెంగళూరు క్యాంపస్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ప్రధాని మోదీ ప్రకటించారు. ఈ సమావేశంలో పశ్చిమాసియా పరిస్థితులతో పాటు పలు అంతర్జాతీయ అంశాలపై కూడా ఇరు నేతలు చర్చించారు. ప్రపంచంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల్లో సంభాషణ, దౌత్యానికి మరింత ప్రాధాన్యం పెరిగిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. పాలస్తీనా సమస్యకు రెండు దేశాల పరిష్కారానికే భారత్ మద్దతు కొనసాగుతుందని మరోసారి స్పష్టం చేశారు.'స్వర్ణయుగానికి నాంది'ఇటీవలి కాలంలో భారత్, ఇండోనేషియా మధ్య పరస్పర విశ్వాసం పెరిగిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. దీంతో రక్షణ, భద్రత, సముద్ర సహకారం మరింత బలపడుతోందని చెప్పారు. రక్షణ రంగ పరస్పర మార్పిడి, విపత్తు నిర్వహణ, పారిశ్రామిక సహకారాన్ని విస్తరించేందుకు ఇరు దేశాలు అంగీకరించినట్లు వెల్లడించారు. 2018లో ఏర్పడిన సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం నేడు కొత్త శిఖరాలకు చేరుకుందని అన్నారు. అభివృద్ధి, భద్రత, సాంకేతికత, విద్య, సంస్కృతి తదితర అన్ని రంగాల్లో కొత్త అడుగులు వేస్తున్నామని పేర్కొన్నారు. భారత్-ఇండోనేషియా సంబంధాల్లో నేటి నుంచే స్వర్ణయుగానికి నాంది పలుకుతున్నామని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. అలాగే బ్లూ ఎకానమీ, సముద్ర వాణిజ్యం, పోర్టుల అభివృద్ధి రంగాల్లో కూడా కలిసి పనిచేయాలని నిర్ణయించారు.

ప్రధాని మోదీకి ఇండోనేషియా అత్యున్నత పౌర పురస్కారం 'బింటాంగ్ ఆదిపుర్ణ' (స్టార్ ఆఫ్ ఇండోనేషియా)ను ఆ దేశ అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో ప్రదానం చేశారు. పురస్కారం స్వీకరించిన అనంతరం మోదీ ఈ గౌరవాన్ని దేశ ప్రజలకు అంకితం చేశారు. ఇండోనేషియా అత్యున్నత పురస్కారాన్ని ఎంతో ఆప్యాయత, గౌరవంతో అందుకున్నానని అన్నారు. ఇది ఇండోనేషియా ప్రజల ప్రేమాభిమానాలకు, మన రెండు దేశాల మధ్య ఉన్న చారిత్రక, సాంస్కృతిక బంధానికి ప్రతీక అని తెలిపారు. ఈ గౌరవం అందించిన అధ్యక్షుడు ప్రబోవో, ఇండోనేషియా ప్రభుత్వం, అక్కడి ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని పేర్కొన్నారు.చర్చలకు ముందు ప్రధాని మోదీకి జకార్తాలో మంగళవారం అద్భుత స్వాగతం లభించింది. గుర్రాలపై భద్రతా దళాల ఎస్కార్ట్, గౌరవ వందనం, సాంప్రదాయ సాంస్కృతిక ప్రదర్శనల మధ్య ప్రధాని మోదీకి ఇండోనేషియా ప్రభుత్వం ఘనంగా ఆహ్వానం పలికింది. ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో స్వయంగా మోదీకి స్వాగతం పలికి ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. అనంతరం ఇరు దేశాల ప్రతినిధి బృందాల మధ్య ద్వైపాక్షిక చర్చలు ప్రారంభమయ్యాయి.

# సీఎం విజయ్‌కి మద్రాసు హైకోర్టు నోటీసులు



**చెన్నై:** మిళనాడు ముఖ్యమంత్రి జోసఫ్ విజయ్ ఎన్నికల విజయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను మద్రాస్ హైకోర్టు విచారణకు స్వీకరించింది. క్రీడా శాఖ మంత్రి ఆదవ్ అర్జున సాధించిన విజయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను కూడా జస్టిస్ వీ లక్ష్మీనారాయణన్ ఏకసభ్య ధర్మాసనం విచారణకు స్వీకరించింది. పిటిషన్లలో ఉన్న కొన్ని సాంకేతిక లోపాలను వారం రోజుల్లోగా సరిదిద్దాలని హైకోర్టు పిటిషనర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. సాంకేతిక ప్రక్రియ పూర్తయిన తర్వాత సీఎం విజయ్, మంత్రి ఆదవ్ అర్జునకు 3 వారాల గడువిస్తూ రిజిస్ట్రీ నోటీసులు జారీ చేయనున్నారు.ఎన్నికల పిటిషన్ల విచారణను అత్యంత వేగంగా.. ఆరు నెలలలోపే పూర్తి చేయాలని హైకోర్టు న్యాయమూర్తి స్పష్టం చేశారు. కాగా, నామినేషన్ అఫిడవిట్‌లో పెండింగ్ కేసుల వివరాలు దాచారని, ఎన్నికల ఖర్చులను పూర్తిగా చూపలేదని విజయ్‌పై డీఎంకే అభ్యర్థి ఇనిగో ఇరుదయరాజ్ ఫిర్యాదు చేశారు. ఎన్నికల ప్రచారంలో చట్ట విరుద్ధంగా చిన్నపిల్లలను ఉపయోగించుకున్నారంటూ ఇనిగో తన పిటిషన్‌లో ప్రస్తావించారు. విజయ్ విజయాన్ని రద్దు చేసి తనను విజేతగా ప్రకటించాలని, అలాగే తిరుచ్చి ఈస్ట్ నియోజకవర్గ ఉపఎన్నికపై స్టే విధించాలని డీఎంకే అభ్యర్థి ఇనిగో కోరారు.

# ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్‌కు తప్పిన ప్రమాదం




**సిరియా :** సిరియా పర్యటన లో ఉన్న ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ కు పెను ప్రమాదం తప్పింది. రాజధాని డమస్కస్‌లో ఆయన బసచేసిన హోటల్ సమీపంలో మంగళవారం వరుస పేలుళ్లు సంభవించాయి. అయితే ఈ ఘటనలో మాక్రాన్ సురక్షితంగా ఉన్నారని, పేలుళ్ల తర్వాత కూడా ఆయన తన పర్యటనను యథావిధిగా కొనసాగించారని ఫ్రాన్స్ అధ్యక్ష భవనం ప్రకటించింది.రాయిటర్స్ కథనం ప్రకారం.. డమస్కస్‌లోని మాక్రాన్ బస చేసిన హోటల్‌కు సమీపంలో ఈ బాంబు పేలుళ్లు జరిగాయి. ఈ ఘటనను సిరియా భద్రతా వర్గాలు ధ్రువీకరించాయి. పేలుళ్ల అనంతరం అధికారులు వెంటనే అప్రమత్తమై ఆ ప్రాంతానికి వెళ్లే రహదారులను మూసివేసి భద్రతను కట్టుదిట్టంచేశారు. సంఘటనా స్థలం నుంచి పొగలు వస్తున్నట్లు రాయిటర్స్ ప్రతినిధి ఒకరు తెలిపారు. పేలుళ్లు జరిగిన సమయంలో మాక్రాన్ తన కాన్వాయ్‌లో వేరే కార్యక్రమానికి వెళుతున్నారని, ఆయనకు పేలుళ్ల శబ్దం కూడా వినిపించలేదని ఫ్రాన్స్ అధ్యక్ష కార్యాలయం స్పష్టంచేసింది.మాక్రాన్‌తో పాటు ఉన్న రాయిటర్స్ జర్నలిస్ట్ కూడా ఈ విషయాన్ని నిర్ధారించారు. ఈ ఘటన జరిగినప్పటికీ మాక్రాన్ ముందుగా నిర్ణయించుకున్న షెడ్యూల్ ప్రకారం సిరియా అధ్యక్షుడు అహ్మద్ అల్-షరాతో అధ్యక్ష భవనంలో సమావేశమయ్యారు. 2024లో బషర్ అల్-అస్సాద్ ప్రభుత్వాన్ని కూలదోసిన తర్వాత, ఒక యూరోపియన్ యూనియన్ దేశాధినేత సిరియాలో పర్యటించడం ఇదే తొలిసారి.

# విపత్తుల వల్ల ప్రాణనష్టం జరగకుండా చూడటమే లక్ష్యం




**అమరావతి, జులై 7:** నైరుతి రుతుపవనాలు, ఎల్‌నినో ప్రభావంపై ఉన్నత స్థాయి అధికారు లతో హోం, విపత్తుల నిర్వహణ శాఖల మంత్రి అనిత సమీక్ష నిర్వహించారు. (మంగళవారం) ఏపీఎస్‌డీఎమ్‌ఏలో() సమావేశం జరిగింది. ఈ సందర్భంగా విపత్తుల ప్రభావాన్ని తగ్గించేలా సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని హోం మంత్రి ఆదేశించారు. విపత్తుల వలన ఏ ఒక్క ప్రాణనష్టం జరగకుండా చూడటమే లక్ష్యమని వెల్లడించారు. రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో నిరంతరం పనిచేసేలా ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు చేయాలన్నారు. రాయలసీమ జిల్లాలపై ఎక్కువగా ఎల్‌నినో ప్రభావం ఉందని.. శ్రీసత్య సాయి, అనంతపురం, అన్నమయ్య జిల్లాల్లో తీవ్రస్థాయిలో వర్షాల కొరత ఉందని హోం మంత్రి తెలిపారు. కర్నూలు, నంద్యాల, చిత్తూరు, కడప జిల్లాల్లో మధ్యస్థంగా వర్షాభావ ప్రభావం ఉందన్నారు. అలాగే ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లోనూ వర్షాభావ ప్రభావం మధ్యస్థంగా ఉందని పేర్కొన్నారు. కరవు ముప్పు ఉన్న మండలాల్లో ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు హోం మంత్రి ఆదేశాలు జారీ చేశారు. వరద ముప్పు ఉన్న లోతట్టు ప్రాంతాల ప్రజల తరలింపునకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. పునరావాస కేంద్రాలలో ఆహారం, తాగునీరు, వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తాగునీరు, విద్యుత్ వంటి కీలక సేవలకు ఎలాంటి అంతరాయం కలగకూడదన్నారు. పోలీస్, ఫైర్, బృందాలు అత్యవసర స్పందనకు సిద్ధంగా ఉండాలని అనిత ఆదేశించారు.

# మూడు ఎకనామిక్ రీజియన్లపై సీఎం చంద్రబాబు సమీక్ష

**అమరావతి:** రాష్ట్రంలోని మూడు ఎకనామిక్ రీజియన్లపై సీ ఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహిం చారు. విశాఖ, అమరావతి, తిరుపతి కేంద్రాలు గా 3 రీజియన్ల అభివృద్ధికి మార్గదర్శకాలను సూచించారు. తీరప్రాంత పర్యాటకం, గ్లోబల్ బిజినెస్-ఇన్నోవేషన్ ఎకో సిస్టమ్, గ్లోబల్ టాలెంట్-ఎలైట్ లివింగ్ అనే మూడు పిల్లర్లపై వైజాగ్ బే సిటీ అభివృద్ధి చేయాలన్నారు. బే సిటీలో291 ఎకరాల ప్రభుత్వ భూమి లభ్యత ఉందని ముఖ్యమంత్రికి అధికారులు తెలిపారు. విశాఖ ఎకనామిక్ రీజియన్‌లో ఇప్పటికి 49 ప్రాజెక్టులు రాగా వీటిలో 18 ప్రాజెక్టులు గ్రౌండ్ అయ్యాయని చంద్రబాబుకు అధికారులు వివరించారు. మరో 12 త్వరలో గ్రౌండ్ కానున్నాయని చెప్పారు. మరో 19 ప్రాజెక్టులు ప్రణాళిక దశలో ఉన్నట్లు తెలిపారు. ఈ క్రమంలోనే స్పందించిన ముఖ్యమంత్రి వచ్చే 3 నెలల్లో లక్ష చదరపు అడుగుల్లో ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్, హోటళ్లు, ఐటీ ప్రాజెక్టులు వచ్చేలా చూడాలని లక్ష్యాన్ని నిర్దేశించారు. అరకు-పాడేరు-విశాఖను పర్యాటక సర్కిల్‌గా రూపొందించి ప్రత్యేక ఆకర్షణ తీసుకురావాల న్నారు. పోర్టులు, ఫిషింగ్ హార్బర్లతో విశాఖ ఎకనామిక్ రీజియన్ అభివృద్ధికి ఎంతో ఆస్కారం ఉందని




వివరించారు. వెల్‌నెస్ సెంటర్లకు ప్రత్యేకంగా భూ కేటాయింపులు జరపాలని చంద్రబాబు వెల్లడించారు. పూర్వో దయ పథకం కింద రూ.40,000ల కోట్లు, ప్రైవేట్ పెట్టుబడులతో మరో రూ.60,000ల కోట్లు ఉద్యానవన రంగానికి ఊతమిస్తాయని అధికారులకు సీఎంకు చెప్పారు. ఈ క్రమంలోనే స్పందించిన చంద్రబాబు వైఎస్సార్ కడప జిల్లా లింగాల మండలంలో ప్రజలు రూ.7.30 లక్షల తలసరి ఆదాయం కలిగి ఉండడం హార్టికల్చర్ పంటల సాగు వల్ల కలిగే లాభాలకు నిదర్శనమన్నారు. పారిశ్రామికాభి వృద్ధి చెందిన ప్రాంతాల కన్నా తలసరి ఆదాయం అధికంగా ఉండటంపై అధ్యయనం చేయాలని చెప్పారు. తిరుపతి ఎకనామిక్ రీజి యన్ మాస్టర్ ప్లాన్‌లో హార్టికల్చర్ రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని నిర్దేశించారు. ఖనిజ సంపద నుంచి హార్టికల్చర్ వరకు పుణ్యక్షేత్రాల నుంచి పర్యాటక ప్రాంతాల వరకు రాయ లసీమకు ఉన్న అనుకూ లతను మార్కెటింగ్ చేసుకోవాలని సీఎం పేర్కొన్నారు తిరుపతి, శ్రీకాళహస్తి, శ్రీశైలం వంటి ఆధ్యాత్మిక ప్రదేశాలు, ఐఐటీ వంటి విద్యా సంస్థలు, గోల్డ్, ఐరన్ ఓర్, లైమ్ స్టోన్ వంటి ఖనిజ వనరులు రాయలసీమ అభివృద్ధికి దోహదపడతాయని చంద్రబాబు వివరించారు. గండికోట, హార్సిలీహిల్స్, తలకోన వంటి పర్యాటక ప్రాంతాలను ఇంటిగ్రేట్ చేయాలన్నా రు. శ్రీసిటీ దేశంలోనే నెంబర్ వన్ ఇండస్ట్రియల్ పార్క్‌గా నిలుస్తోందని ఓర్వకల్లు, కొప్పర్తి పారిశ్రామికవా డలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అన్ని రంగాల్లోనూ పెట్టుబడులకు తిరుపతి రీజియన్ అనుకూలమని చంద్రబాబు వివరించారు. రాష్ట్ర జనాభాలో 32 శాతం అమరావతి ఎకనామిక్ రీజియన్‌లో నివసిస్తున్నారని భౌగోళికంగా 33 శాతం విస్తరించి ఉందని అధికారులు చంద్రబాబుకు తెలిపారు. భౌగోళికంగా రాష్ట్రానికి మధ్యలో ఉండటం, నైపుణ్యం కలిగిన మానవ వనరులు ఉండటం కలిసొచ్చే అంశమన్నారు. అమరావతి ఎకనామిక్ రీజియన్ పరిధిలో కృష్ణా జిల్లా తలసరి ఆదాయంలో ముందుందని చెప్పారు. జిల్లాల వారీగా రీజియన్ అభివృద్ధి జరిగేలా వర్క్ షాపులు నిర్వహిస్తున్నట్టు వివరించారు. ఆక్వా, పామాయిల్, కోకో ఉత్పత్తులతో పాటు కొల్లేరు వినియోగించుకోవాలని సీఎం సూచించారు. అమరావతి, తిరుపతి ఎకనామిక్ రీజియన్ల మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసి, ముసాయిదాపై ప్రజలు, ప్రజాప్రతినిధులు అభిప్రాయాలు తీసుకోవాలని సీఎం నిర్దేశించారు. 2 నెలల్లో డిస్ట్రిక్ట్ ఎకనమిక్ ప్రొఫైల్ సిద్ధం చేయాలన్నారు. కలెక్టర్లు తమ ప్రాంతాన్ని ఏ రంగాల్లో అభివృద్ధి చేసే అవకాశం ఉందో ప్రణాళికలు తయారు చేయాలని చెప్పారు. అమరావతి, తిరుపతి, విశాఖలో అంతర్జాతీయ క్రీడా పోటీలు నిర్వహణకు ప్రణాళికలు రూపొందించాలన్న సీఎం ప్రైవేట్ భాగస్వామ్యంతో 3చోట్లా స్పోర్ట్స్ సిటీల అభివృద్ధి జరగాలని తెలిపారు. సూర్యలంక సహా వివిధ ప్రాంతాల్లోని బీచ్ ఫ్రంట్‌లు అభివృద్ధి చేయాలని వివరించారు. సూర్య లంక బీచ్ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ తయారీకి నిర్దేశించారు. ప్రతీ 2 నెలలకు ఒకసారి 3 ఎకనామిక్ రీజియన్లపై సమీక్ష నిర్వహిస్తామని చంద్రబాబు పేర్కొన్నారు.

# 'జయలలితకో న్యాయం, జగన్‌కు మరో న్యాయమా

**అమరావతి :** తమిళనాడు దివంగత ముఖ్యమంత్రి జయల లితకు ఒక న్యాయం, ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్ కు మరో న్యాయమా అంటూ ప్రశ్ని ంచా రు కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ . ఆదా యానికి మించిన ఆస్తుల కేసుల్లో కేంద్రం, దర్యా ప్తు సంస్థలు ఎందుకు ఉదాసీనంగా వ్యహరి స్తున్నాయని ప్రశ్నించారు. వైఎస్ జగన్ విషయ ంలో కేంద్రం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని సంచలన వ్యాఖ్యలు చేశారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కేసుల విషయంలో కోర్టులు చొరవ తీసుకుని విచారణ చేయాలని కోరారు. రాజకీయ ఒత్తిడి కారణమనే అనుమానాలు ప్రజల్లో మొదలయ్యాయని వ్యాఖ్యానించారు. ఏపీలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం రాష్ట్రానికి రూ.20 లక్షల పెట్టుబడులు తెచ్చామని గొప్పలు చెప్పుకుంటోందని.. క్షేత్రస్థాయిలో మాత్రం అభివృద్ధి కనిపించడం లేదన్నారు చింతా మోహన్. ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పానికి



ఏం చేశారో అక్కడి ప్రజలకు చెప్పాలన్నారు.. ఇకనైనా మాటలు కాకుండా పనులు చేయాలని హితవు పలికారు. ఆంధ్రప్రదేశ్‌లో పోలీసులు అత్యుత్సాహంతో అమాయకులపై అక్రమంగా కేసులు పెడుతున్నారని ఆరోపించారు. ప్రశ్న రావణ్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కొంత విశాల హృదయంతో ఆలోచించాలని.. ఆయన తెలిసో, తెలియకో నోరు జారి ఉంటారన్నారు చింతా మోహన్. ఆంధ్రప్రదేశ్‌లో 2029లో జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు, దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా వంటి అంశాలతో ప్రజల్లోకి వెళు తుందన్నారు. అయోధ్య రామమందిరం పేరుతో కోట్లాది రూపాయలు వసూలు చేసి అవినీతికి పాల్పడ్డారని.. ఈ అంశంపై సీబీఐతో విచారణ చేయించాలన్నారు మోహన్. అప్పుడు అసలు నిజాలు బయటకు వస్తాయని.. అయోధ్యలో దేవుడి పేరుతో జరిగిన నిధుల దుర్వినియోగంపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ ఇజ్రాయిల్ పర్యటనకు ఎందుకు వెళ్లారు.. అక్కడ ఏ అంశాలపై చర్చించారో ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధాని మోదీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రభావంతో నిర్ణయాలు తీసుకుంటారని విమర్శించారు. గాజాలో చిన్నపిల్లలు ప్రాణాలు కోల్పోతున్నా భారత విదేశాంగశాఖ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు చింతా మోహన్.

# వైఎస్ జగన్‌ను కలిసిన ఉపాధ్యాయ సంఘం నేతలు.



**అమరావతి :** వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ వైఎస్ జగన్‌ను() ఉపాధ్యాయ సంఘం నేతలు కలిశారు. సర్వీస్‌లో ఉన్న టీచర్స్‌కు టెట్( నిబంధన సరికాదని వివరించారు. బీఈడీ చేసి 25 ఏండ్లే క్రితం ఉద్యోగం సాధించిన తమకు మళ్లీ టెట్ పరీక్ష రాయాలనడం సరైంది కాదన్నారు. ఈ విషయంలో జోక్యం చేసుకొని కేంద్ర ప్రభుత్వం మాట్లాడాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. సానకూలంగా స్పందించిన జగన్ సమస్య పరిష్కారానికి తన వంతు ప్రయత్నం చేస్తానని హామీనిచ్చారు.

## దేశంలోనే అత్యంత బెస్ట్ ఎయిర్‌పోర్ట్‌గా భోగాపురం




**విజయనగరం, జులై 7:** భోగాపురం ఎయిర్‌పోర్టు పనులను వేగంగా పూర్తి చేశామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. (మంగళవారం) భోగాపురం అంతర్జాతీయ విమానాశ్ర యం తుది మెరుగుల సమీక్ష సమా వేశం జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, జీఎం ఆర్‌తో కలిసి బ్రహ్మాండమైన ఎయిర్‌పోర్టును నిర్మించినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి నెలలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇక్కడికి వచ్చారని.. అనుకున్న సమయానికంటే ముందుగానే నిర్మాణం చేపట్టాలని ఆదేశించా రని అన్నారు. ఆ ఆదేశాలు మేరకు అనుకున్న సమయానికే జీఎంఆర్ సంస్థ ఎయిర్‌పోర్టును నిర్మించిందని చెప్పారు. ఎయిరో డ్రో లైసెన్స్ కూడా వచ్చిందని కేంద్ర మంత్రి తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవం జరుగుతుందన్నా రు. ఎయిర్‌పోర్టు ప్రారంభమైన వారం తర్వాత ఆపరేషన్స్ నిర్వహిస్తామన్నారు. మోదీ షెడ్యూల్ ఖరారైన తర్వాత తేదీ ప్రకటిస్తామని కేంద్ర మంత్రి వెల్లడించారు. విశాఖ ఎయిర్‌పోర్టు కార్యకలాపాలను భోగాపురానికి తరలిస్తామని చెప్పారు. రాబోయే రోజుల్లో 4 కోట్ల మంది ప్రయాణించే విధంగా టెర్మినల్ నిర్మాణం జరుగుతుందన్నారు. 78,000 చదరపు మీటర్ల మేర టెర్మినల్ బిల్డింగ్ నిర్మించామని తెలిపారు. భోగాపురం ఎయిర్‌పోర్టు.. దేశంలోనే బెస్ట్ ఎయిర్‌పోర్టు డిజైన్‌గా ఉందని కితాబిస్తున్నారని అన్నారు. ఉత్తరాంధ్ర కళలు, సాంప్రదాయాన్ని ఉట్టిపడేలా ఇంటీరియర్ డిజైన్ చేపట్టినట్లు చెప్పారు. దేశంలోనే అత్యంత బెస్ట్ ఎయిర్‌పోర్ట్‌గా భోగాపురం నిలవనుందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

# 'నేను షాకయ్యా.. ఇది ప్రజల ప్రాణాలకు, ఆరోగ్యానికి చాలా ప్రమాదం'

**తూర్పుగోదావరి జిల్లా:** రాజమహేంద్రవరం సమీపంలో స్థానికులు కొంతకాలంగా ఇసుక లారీల కారణంగా ఇబ్బందిపడుతున్నారు. ఈ ఇసుక లారీ కారణంగా రోడ్లు పాడైపోతున్నాయని, జనాల కళల్లోకి, ముక్కుల్లోకి దుమ్ము వెళుతోంది. ఈ సమస్యపై టీడీపీ మహిళా కార్యకర్త జాహ్నవి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌లకు గత నెలలో ఫిర్యాదు చేశారు. ఈ సమస్య మరింత తీవ్రతరం కావడంతో తాజాగా మరోసారి ట్వీట్ చేసి ట్యాగ్ చేయడంతో మంత్రి లోకేష్ స్పందించారు. ప్రజలకు ఇబ్బందిగా మారిన సమస్యపై స్పందించారు.. జనాల ప్రాణాలకు, ఆరోగ్యానికి ప్రమాదమని.. సమస్యను పరిష్కరించాలంటూ అధికారుల్ని ఆదేశించారు. ఇదంతా చూసి తాను షాకయ్యానని. ఇది ప్రజల భద్రతకు, ఆరోగ్యానికి చాలా ప్రమాదమన్నారు మంత్రి లోకేష్. వెంటనే రాజమహేంద్రవరం మున్సిపల్ కమిషనర్, గనుల శాఖతో సమన్వయం చేసుకుని.. ఈ రోడ్డును వెంటనే మరమ్మత్తు చేయించాలని సూచించారు. మంత్రి లోకేష్ తమ సమస్యపై స్పందించి అధికారులకు



ఆదేశాలు ఇవ్వడంతో టీడీపీ కార్యకర్త జాహ్నవి ధన్యవాదాలు తెలిపారు. రాజమహేంద్రవరం సమీపంలోని కాతేరు, మల్లయ్యపేట సమీపంలో రోడ్లు దారుణంగా దెబ్బ తిన్నాయని జాహ్నవి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్‌లకు ఫిర్యాదు చేశారు. ఈ సమస్యపై స్పందించి పరిష్కరించాలని కోరారు. ప్రతి రోజూ ఇసుక లారీలు ఈ రోడ్డులో రాకపోకలు సాగిస్తుండటంతో గుంతలమయంగా మారిందని, దుమ్ముతో నిండిపోతుందన్నారు. ఈ రోడ్డులో ప్రయాణించే స్థానికులు ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారని.. దుమ్ము భరించలేనంతగా పెరిగిపోయిందని, తరచుగా ప్రజల కళ్లలోకి, ముక్కులోకి వెళ్లడంతో ఆరోగ్య సమస్యలు ఎదురవుతున్నాయ న్నారు. ఈ సమస్యను విన్నవిస్తూ చాలామంది ఇప్పటికే వీడి యోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారని చెప్పుకొచ్చారు. ఈ సమస్యను స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారుల దృష్టికి పదే, పదే తీసుకెళ్లినా శాశ్వత పరిష్కారం లభించలే దన్నారు. ఎవరైనా ముఖ్యమైన ప్రభుత్వ పెద్దలు ఈ రోడ్డు మార్గంలో వస్తే.. ఆ సమయంలో తాత్కాలికంగా మరమ్మత్తులు చేయిస్తున్నారన్నా రు. ఇటీవల డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పర్యటనకు వచ్చిన సమయంలో ఈ రోడ్డును తాత్కాలికంగా రిపేర్ చేయించారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రహదారుల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని. ఈ రోడ్డు సమస్యను కూడా పరిష్కరించాలని కోరారు. రెండేళ్లుగా ఈ సమస్య గురించి చెబుతున్నా పరిష్కారం కావడం లేదన్నారు. అందుకే వెంటనే జోక్యం చేసుకుని ఈ సమస్యను అత్యంత ప్రాధాన్యతగా పరిగణించి తాత్కాలికంగా కాకుండా శాశ్వత పరిష్కారం చూపిస్తే బావుంటుందని కోరారు. గత నెలలో జాహ్నవి ఈ ట్వీట్ చేశారు. తాజాగా మరోసారి ఈ సమస్య గురించి ట్వీట్ చేశారు. ఈ రోడ్డు సమస్య రోజు, రోజుకు తీవ్రమవుతోం దని. తాను ఇటీవల రాజమహేంద్రవరం మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తే.. ఇది గనులశాఖ పరిధిలోకి వస్తుందని కమిషనర్ తనతో చెప్పిన విషయాన్ని ప్రస్తావించారు. రాజమహేంద్రవరం, కాతేరు ప్రజలు చాలా కాలంగా ఈ సమస్య ఎదుర్కొంటున్నారని.. దుమ్ము, దెబ్బతిన్న రోడ్లు, ఇసుక లారీల రాకపోకల కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మరోసారి సమస్యను వివరించారు. అలాగే ఆరోగ్యపరమైన సమస్యలతో పాటుగా ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని మరోసారి కోరారు. జాహ్నవి ట్వీట్‌పై స్పందించిన మంత్రి లోకేష్ సమస్యను పరిష్కరించాలని అధికారుల్ని ఆదేశించారు.

# సనాతన ధర్మాన్ని కించపరిచేలా ప్రకాశ్ రాజ్ వ్యాఖ్యలు

**విశాఖపట్నం, జులై 7:** మతాల మధ్య చిచ్చు పెట్టాలని వైసీపీ చూస్తోందని ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు స్వామి శ్రీనివాసానంద సరస్వతి ఆరోపించారు. (మంగళవారం) మీడియాతో మాట్లాడుతూ.. ప్రశ్న రావణ్, జడ శ్రవణ్ కుమార్, ప్రకాశ్ రాజ్.. ప్రతిరోజూ హిందువులపై విషాన్ని చిమ్ముతున్నారని మండిపడ్డారు. హిందూ వ్యతిరేకంగా ఉన్నవారందరికీ వైసీపీ న్యాయ సహాయం చేస్తోందన్నారు. హిందువుల పేర్లు పెట్టుకుని సనాతన ధర్మాన్ని కించపరిచేలా నటుడు ప్రకాశ్ రాజ్ మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందువుల ఆరాధ్య దైవాలను కించపరిచే హక్కు ఎవరిచ్చారని స్వామీజీ ప్రశ్నించారు. ప్రభుత్వం.. తప్పులు చేస్తున్న వారిని చట్టప్రకారం అరెస్టు చేస్తుంటే అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. కరుణాకర్ రెడ్డి టీటీడీ ఛైర్మన్‌గా ఉన్న సమయంలో జరిగిన తప్పులను ఎత్తి చూపినందుకే




తమను టార్గెట్ చేశారన్నారు. హిందూ మనోభావాలను దెబ్బతీస్తూ చేస్తున్న వ్యాఖ్యల వెనుక వైసీపీ కుట్ర ఉందని స్వామి శ్రీనివాసానంద ఆరోపించారు. తమిళనాడు సీఎంపై ప్రశంసలుతమిళనాడు సీఎం విజయ్‌పై స్వామి శ్రీనివాసానంద సరస్వతి ప్రశంసలు కురిపించారు. హిందూ ఆలయాల నుంచి వచ్చే నిధులను ఆలయాల అభివృద్ధి కోసమే వాడుతామని తమిళనాడు సీఎం తీసుకున్న నిర్ణయం హర్షణీయమన్నారు. విజయ్ నిర్ణయాన్ని తాము సంపూర్ణంగా స్వాగతిస్తున్నామని చెప్పారు. హిందూ ఆలయాల నిధులను ఇతర అవసరాల కోసం మళ్లించకూడదని అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న సీఎంలు కూడా తమిళనాడు సీఎం తీసుకున్న నిర్ణయమే తీసుకోవాలని స్వామీజీ కోరారు. ఆ ముసుగులో హిందుత్వంపై దాడులు: శ్రీరామ్నాన్ ప్రకారమే సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లపై దాడులు చేస్తున్నారని హిందూ సంఘాల నేత తురగా శ్రీరామ్ అన్నారు. ఏపీలో రిజర్వేషన్ల జిహాద్ జరుగుతోందని ఆరోపించారు. రిజర్వేషన్లను లాక్కునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. రిజర్వేషన్లు లాక్కునేవారి వెనుక నాయకులు ఉన్నారని వ్యాఖ్యానించారు. కొంతమంది యూట్యూబర్, జర్నలిస్టుల ముసుగులో హిందుత్వంపై దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రశ్న రావణ్‌కు మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి మద్దతు ఇస్తున్నారంటే అర్థం ఏంటి అని శ్రీరామ్ ప్రశ్నించారు.

## దేశాన్ని, హిందూమతాన్ని అవమానించిన వారిని జగన్ వెనకేసుకొస్తున్నారు.

**రాజమండ్రి, జులై 7 ():** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపైమంత్రి కొల్లు రవీంద్ర తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశాన్ని, హిందూమతాన్ని అవమానించిన వారిని జగన్ వెనకేసుకొస్తున్నారని ధ్వజమెత్తారు. మంగళవారం రంపచోడవరం మండలం పందిరి మామిడిలో నీరా ప్లాంటేషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడారు. బీసీలను పారిశ్రామికవేత్తలుగా మార్చేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని వ్యాఖ్యానించారు. జగన్ హయాంలో బీసీలకు ద్రోహం చేశారని దుయ్యబట్టారు. 34 శాతం ఉన్న బీసీ రిజర్వేషన్లు 24 శాతానికి తగ్గించారని చెప్పుకొచ్చారు. వైసీపీ హయాంలో 1,608 మంది బీసీలు పదవులు కోల్పోయారని తెలిపారు. వైసీపీ నేతలు బీసీ రౌండ్‌టేబుల్ పేరుతో కుట్రలు చేస్తున్నారని మంత్రి ఆగ్రహించారు. ఏపీకి పెట్టుబడులు రావడం జగన్‌కు ఇష్టం లేదని దుయ్యబట్టారు. వైసీపీ హయాంలో జరిగిన రూ.3500 కోట్ల లిక్కర్



స్కాం దేశంలోనే పెద్దదని సుప్రీంకోర్టు చెప్పిందని అన్నారు. పనికిరాని బ్రాండ్లతో వేలకోట్లు దోచుకున్నారని ఫైర్ అయ్యారు. నాసిరకం మద్యంతో వేలమందిని పొట్టన పెట్టుకున్నారని ఆరోపించారు. వైసీపీని అడ్రస్ లేకుండా చేస్తామని హెచ్చరించారు. కేరళ, గోవా తరహాలో రాష్ట్రంలో బీచ్ షాక్స్ ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ధరల అమ్మకాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేస్తున్నారని అన్నారు. ఎమ్మార్పీకి మించి అమ్మితే మద్యం షాపులు సీజ్ చేస్తామని మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు.

# సీఎం రేవంత్ రెడ్డి మామకు గౌరవ డాక్టరేట్.. యునైటెడ్ అమెరికా వర్సిటీ నుంచి ప్రదానం



**హైదరాబాద్ :**తెలంగాణలో సామాజిక, విద్యరంగంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తు న్న అభ్యుదయ భారత్ ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు సూదిని పద్మారెడ్డి అరుదైన గౌరవాన్ని దక్కించుకున్నారు. ప్రముఖ అంతర్జాతీయ విద్యా సంస్థ యునైటెడ్ అమెరికన్ వర్సటీ ఆయనకు ప్రతిష్టాత్మక గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. దేశవ్యాప్తంగా మానవీయ, సామాజిక, విద్యా రంగాలలో విశిష్ట సేవలు అందిస్తున్న ప్రముఖులను గుర్తించి ఈ యూనివర్సిటీ ఏటా డాక్టరేట్లు అందిస్తుంది. ఇందులో భాగంగా పుదుచ్చేరిలోని కలైరంగమ్ ఆడిటోరియంలో సోమవారం జరిగిన కన్వకేషన్ వేడుకల్లో తెలంగాణ రాష్ట్రం తరఫున సూదిని పద్మారెడ్డి ఈ గౌరవ డాక్టరేట్‌ను స్వీకరించారు. డాక్టరేట్ తీసుకున్న అనంతరం పద్మారెడ్డి మాట్లాడుతూ.. తమ ట్రస్ట్ ద్వారా చేస్తున్న చిన్న సేవలను గుర్తించి అంతర్జాతీయ స్థాయిలో గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసినందుకు యునైటె డ్ అమెరికన్ యూనివర్సిటీకి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు చెప్పారు. ఈ పురస్కారం తనపై బాధ్యతను మరింత పెంచిందని.. రాబోయే రోజుల్లో తెలుగు రాష్ట్రాల్లో తమ ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలను మరింత విస్తరిస్తామని ప్రకటించారు.కాగా, తెలంగాణ ప్రస్తుత ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి సూదిని పద్మారెడ్డి స్వయాన మామ. మాజీ కేంద్ర మంత్రి, దివంగత సూదిని జైపాల్ రెడ్డికి సొంత తమ్ము డు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా (ప్రస్తుత రంగారెడ్డి జిల్లా) పరిధిలోని మాడ్గుల గ్రామం వీరి స్వగ్రామం. ఉన్నత రాజకీయ కుటుంబ నేపథ్యం ఉన్నప్పటికీ పద్మారెడ్డి తన జీవితాన్ని ప్రజా సేవకే అంకితం చేశారు. తాను స్థాపించిన అభ్యుదయ భారత్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా గత 25 సంవత్సరాలుగా తెలంగాణ వ్యాప్తంగా ఎన్నో విప్లవాత్మక కార్యక్ర మాలకు శ్రీకారం చుట్టారు. ముఖ్యంగా వెనుకబడిన గ్రామీణ ప్రాంతాలలోని ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల మౌలిక వసతుల అభివృద్ధికి ఆయన పెద్దఎత్తున నిధులు సమకూరుస్తున్నారు. పేద విద్యార్థులు చదువు మధ్యలో ఆపేయకుండా ఉండేందుకు ప్రతీ ఏటా స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్నారు. కేవలం ఆర్థిక సాయమే కాకుండా.. పేద ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులలో ఆత్మవిశ్వాసం పెంచడానికి వారిని ఉచితంగా విమానాల్లో తీసుకెళ్లడం, తిరుమల శ్రీవారి బ్రేక్ దర్శనాలు కల్పించడం వంటి వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పద్మారెడ్డికి తెలంగాణ ఉద్యమంతోనూ అనుబంధం ఉంది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సిద్ధించాలనే బలమైన ఆకాంక్షతో 2001లోనే కేసీఆర్ నేతృత్వంలోని టీఆర్ఎస్ పార్టీలో చేరారు. తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ సిద్ధాంతాల పట్ల, ఆలోచనల పట్ల స్ఫూర్తి పొంది ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారు. అయితే కొన్ని వ్యక్తిగత కారణాల వల్ల 2008 తర్వాత రాజకీయాల నుంచి తప్పుకున్నారు.

## కొండా సురేఖ-కడియం శ్రీహరి మధ్య ముదురుతున్న వివాదం



**వరంగల్, జూలై 7:** మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే కడియం శ్రీహరి మధ్య విభేదాలు మరోసారి తెరపైకి వచ్చాయి. జిల్లా వ్యవహారాల్లో కడియం శ్రీహరి జోక్యం చేసుకుంటున్నారంటూ మంత్రి సురేఖ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ అంశంపై కాంగ్రెస్ అధిష్ఠానానికి ఫిర్యాదు చేశారు. నిన్న(సోమవారం) వరంగల్ నియోజకవర్గ అభివృద్ధి అంశాలపై అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్‌కు సమగ్ర మాస్టర్ ప్లాన్ రూపొందించాలని అధికారులను కోరినట్లు తెలిసింది.వరంగల్ జిల్లా వ్యవహారాల్లో కడియం శ్రీహరి జోక్యం చేసుకోవడంపై మంత్రి కొండా సురేఖ అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై ౼ూ×జజతో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఫిర్యాదు చేస్తూ లేఖ రాయడం ప్రస్తుతం సంచలనంగా మారింది. ఈ పరిణామంతో కొండా సురేఖ, కడియం శ్రీహరి మధ్య కొనసాగుతున్న రాజకీయ విభేదాలు మరోసారి బయటపడ్డాయి. దీనిపై కాంగ్రెస్ అధిష్ఠానం స్పందన ఏంటనేది ఆసక్తికరంగా మారింది.

## ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా అమలు చేయాలి



**ఎర్రుపాలెం, జూలై 07 :** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణం గా పకడ్బందీగా, పారదర్శకంగా అమలు చే యాలని ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ అధికారులను ఆదేశించారు. రాజకీయ పార్టీల సహకారంతో అర్హులైన ప్రతి ఓటరు వివరాలు నమోదు అయ్యేలా చర్యలు చేపట్టాలని సూచిం చారు. మంగళవారం ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం తాసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. ఓటరు జాబితా సవరణ ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత కీలకమైన ప్రక్రియ అని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించాలని ఆదేశించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ వద్ద ఉన్న ఓటర్ల వివరాలను సంబంధిత బీఎల్ఓలకు అందజేసి ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. ప్రజలకు ఎలాంటి సందేహాలు, ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అవగాహన కల్పిస్తూ సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులు నిబంధనల మేరకు సకాలంలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో పారదర్శకత, ఖచ్చితత్వానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తాసీల్దార్ కె.సునీత, ఎలిజబెత్, ఆర్ఐలు రవి కుమార్, శ్రీషా, నాయకులు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి, బొగ్గుల శ్రీనివాసరెడ్డి, బొగ్గుల గోవర్ధన్ రెడ్డి, నాగిరెడ్డి, రాజీవ్ గాంధీ పాల్గొన్నారు.

# ఈసీ నోటీసులకు సమాధానం చెప్పండి - కల్వకుంట్ల కవితకు సూచించిన దిల్లీ హైకోర్టు




**హైదరాబాద్ :**టీఆర్ఎస్ పేరు విషయంలో ఎన్నికల కమిషన్ అభ్యంతరాలపై కల్వకంట్ల కవిత దిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. టీఆర్ఎస్ పేరును తన పార్టీ పేరుగా ఖరారు చేయాలని పిటిషన్?లో ఆమె విజ్ఞప్తి చేశారు. విచారణకు స్వీకరించిన ధర్మాసనం ముందుగా జూన్ 23న ఈసీ ఇచ్చిన నోటీసుకు సరైన రీతిలో సమాధానం చెప్పాలని ఆదేశించింది. ఈ సమయంలో ఆదేశాలు జారీచేస్తే ఈసీ విధుల్లో జోక్యం చేసుకోవడమేనని తెలిపింది.అప్పుడే కోర్టుకు రండి : టీఆర్ఎస్ రిజిస్ట్రేషన్‌పై తీవ్రమైన అభ్యంతరాలు వచ్చాయని కోర్టు గుర్తు చేసింది. అభ్యంతరాలు ఏమీ ఇవ్వలేదని, వ్యక్తిగతంగా వాదనలకు అవకాశం ఇవ్వలేదని కవిత న్యాయవాదులు వాదించారు. నిబంధనల ప్రకారమే నడుచుకున్నామని ఈసీ తెలిపింది. టీఆర్ఎస్ అనేది ఒకే పేరుగా కనిపిస్తుందని ప్రత్యామ్నాయ పేర్లు ఇవ్వాలని, తెలంగాణ రక్షణ సమితి పేరు టీఆర్ఎస్‌కు అర్థం వచ్చేలా ఉందని హైకోర్టు పేర్కొంది. ఈసీ లేవనెత్తిన అభ్యంతరాలకు సమాధానం చెప్పాలని, ఈసీకి సమాధానాలు చెప్పాకే కోర్టుకు రావాలని కవితకు న్యాయస్థానం సూచించింది.ఆ పేరుకు విశిష్టమైన ప్రత్యేక గుర్తింపు వచ్చింది : టీఆర్ఎస్ పార్టీపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ బీఆర్ఎస్ గతంలో కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు చేసింది. తమ అభ్యంతరాల్లో కీలక అంశాలను ప్రస్తావనకు తీసుకువచ్చింది. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో టీఆర్?ఎస్ (తెలంగాణ రాష్ట్ర సమితి)? అనే పేరు ప్రజల భావోద్వేగాలతో ముడిపడి ఉందని, 14 సంవత్సరాల ఉద్యమ చరిత్రలో ఆ పేరుకు విశిష్టమైన ప్రత్యేక గుర్తింపు వచ్చిందని పేర్కొంది.పార్టీ పేరు మారి భారత రాష్ట్ర సమితిగా మారినా ఇప్పటికీ తెలంగాణ ప్రజలు తమ పార్టీని టీఆర్?ఎస్?గానే పరిగనిస్తున్నారని, అలాంటి పరిస్థితుల్లో అదే సంక్షిప్త నామాన్ని మరో రాజకీయ పార్టీకి కేటాయిస్తే ప్రజల్లో గందరగోళం ఏర్పడే అవకాశం ఉందని ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లింది. కవిత పార్టీ పేరుపై ప్రధానంగా భారత రాష్ట్ర సమితి పార్టీ నేతలు, శ్రేణులు, అనుచరులవే భారీ స్థాయిలో అభ్యంతరాలు వెళ్లాయి. కవిత టీఆర్?ఎస్? పార్టీ పేరు వాడడంపై రాష్ట్రానికి చెందిన తెలంగాణ రాజ్య సమితి పార్టీ సైతం అభ్యంతరం వ్యక్తం చేసింది.మహారాష్ట్రలోనూ టీఆర్ఎస్ : కవిత పార్టీ ప్రకటనకు ముందే టీఆర్?ఎస్? పేరుపై మరో అప్లికేషన్ ఈసీకి చేరింది. మహారాష్ట్రలోని సోలాపూర్ కేంద్రంగా పని చేస్తున్న తెలంగాణ రాష్ట్ర సామాజిక సేన సంస్థ-టీఆర్ఎస్? సంక్షిప్త నామాన్ని కోరుతూ ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించింది. ఆ సంస్థ తరఫున దయానంద్ మహాదేవ్ మామ్ డ్యాల్ అనే వ్యక్తి ఎన్నికల సంఘానికి అప్లై చేసినట్లు సమాచారం.కవితకు ఈసీ లేఖ : కవిత ఏప్రిల్? 25న ఏర్పాటు చేసిన టీఆర్ఎస్ పార్టీ పేరుపై పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు అందినట్లు కేంద్ర ఎన్నికల సంఘం తెలిపింది. దీంతో ప్రత్యామ్నాయ పేర్లు సూచించాలని కోరుతూ కవితకు లేఖను రాసింది. అభ్యంతరాలపై లేఖను పంపిన ఈసీకి తెలంగాణ రక్షణ సేన సమాధానాలు పంపింది.

# ప్రియుడితో కలిసి భర్తను చంపిన భార్య.



**నిజామాబాద్ :**నిజామాబాద్ జిల్లాలో నమ్మశక్యం కాని రీతిలో అత్యంత కిరాతకమైన, క్రూరమైన హత్యోదంతం వెలుగుచూసింది. తన వివాహేతర సంబంధానికి అడ్డంగా ఉన్నాడనే నెపంతో ఓ భార్య.. ప్రియుడితో కలిసి భర్తను మేడపై నుంచి తోసేసింది. అయితే అప్పటికీ అతడు చనిపోకపోవడంతో.. ఆసుపత్రి బెడ్‌పై చికిత్స పొందుతున్న అతడి నరాల్లోకి ఏకంగా టాయిలెట్ క్లీనర్ అయిన హార్పిక్‌ను ఇంజెక్షన్ ద్వారా ఎక్కించి ప్రాణాలు తీసింది. మోపాల్ మండలం న్యాల్‌కల్ గ్రామంలో జరిగిన ఈ భయంకర సంఘటన స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టించింది. తొలుత ప్రమాదవశాత్తూ జరిగిన మరణంగా అందరినీ నమ్మించినప్పటికీ.. పోస్ట్‌మార్టం నివేదికతో ఈ వికృత హత్యోదంతం వెలుగులోకి వచ్చింది.అసలేం జరిగిందంటే..?పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. న్యాల్‌కల్ గ్రామానికి చెందిన ప్రశాంత్‌కు, సంధ్య అనే మహిళకు చాలా ఏళ్ల క్రితమే వివాహం జరిగింది. అయితే కుటుంబ పోషణ నిమిత్తం ప్రశాంత్ గల్ఫ్ దేశాలకు వెళ్లి అక్కడ కష్టపడి పని చేస్తూ భార్యకు డబ్బులు పంపుతున్నాడు. భర్త ఊరిలో లేని సమయాన్ని ఆసరాగా చేసుకున్న సంధ్య.. బంటి అనే స్థానిక యువకుడితో పరిచయం పెంచుకుంది. అది కాస్తా వివాహేతర సంబంధానికి దారితీసింది. ఇదిలా ఉండగా.. ప్రశాంత్ గల్ఫ్ నుంచి స్వగ్రామానికి తిరిగి వచ్చాడు. ఈ క్రమంలోనే తన భార్య సంధ్యకు బంటి అనే యువకుడితో ఉన్న అక్రమ సంబంధం గురించి అతనికి తెలిసింది. దీంతో భార్యాభర్తల మధ్య గత కొన్ని రోజులుగా తీవ్ర స్థాయిలో గొడవలు జరుగుతున్నాయి. తమ బంధానికి ప్రశాంత్ శాశ్వతంగా అడ్డంగా మారాడని భావించిన సంధ్య, ప్రియుడు బంటితో కలిసి అతడిని వదిలించుకోవాలని ఒక భయంకరమైన స్కెచ్ వేసింది.ప్రియుడిపై మోజుతో.. నరాల్లోకి హార్పిక్ ఎక్కించి భర్తను చంపిన భార్యమేడపై నుండి తోసేసి.. ఆపై ఆసుపత్రిలోనే కిరాతకం!గత నెల 30వ తేదీన సంధ్య తన ప్లాన్‌ను అమలు చేసింది. భర్త ప్రశాంత్‌తో అత్యధికంగా మద్యం తాగించింది. అతడు పూర్తిగా మత్తులోకి జారుకున్నాక.. ప్రియుడు బంటి సహాయంతో ప్రశాంత్‌ను ఇంటి పైకప్పు మీద నుంచి క్రిందికి తోసేసింది. తీవ్ర గాయాలపాలైన ప్రశాంత్‌ను కుటుంబ సభ్యులు గమనించి తక్షణమే నగరంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అయితే పైనుంచి పడినా భర్త ప్రాణాలతో బ్రతకడాన్ని సంధ్య తట్టుకోలేకపోయింది. ఆసుపత్రిలో ప్రశాంత్ బెడ్‌పై ఉన్న సమయంలో.. ఎవరికీ అనుమానం రాకుండా ప్రియుడు బంటి తెచ్చిన సిరంజి సహాయంతో ప్రాణాంతకమైన హార్పిక్‌ను నేరుగా ప్రశాంత్ చేతికి పెట్టిన సెలైన్‌లోకి ఇంజెక్ట్ చేసింది. ఆ కెమికల్స్ శరీరంలో కలవడంతో ప్రశాంత్ అక్కడికక్కడే విలవిలలాడుతూ ప్రాణాలు విడిచాడు. మరోవైపు మద్యం మత్తులో బిల్డింగ్ పైనుంచి పడిపోవడం వల్లేవిలవిలలాడుతూ ప్రాణాలు విడిచాడు. ప్రశాంత్ చనిపోయాడని సంధ్య అందరినీ నమ్మించి ఏడ్చింది. పోస్ట్‌మార్టంలో తేలిన అసలు గుట్టు..అయితే ప్రశాంత్ మరణంపై అనుమానం రావడంతో పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ పరీక్షల్లో ప్రశాంత్ శరీరంలోకి, నరాల్లోకి టాయిలెట్ క్లీనర్ వెళ్లడం వల్లే అంతర్గత అవయవాలు దెబ్బతిని చనిపోయాడనే షాకింగ్ నిజం బయటపడింది. దీంతో పోలీసులు భార్య సంధ్యను తమదైన శైలిలో విచారించగా.. ప్రియుడు బంటితో కలిసి తానే ఈ ఘాతుకానికి పాల్పడినట్లు అంగీకరించింది. పోలీసులు నిందితులు ఇద్దరినీ కస్టడీలోకి తీసుకుని కేసును విచారిస్తున్నారు.

## హైదరాబాద్‌లో దారుణం.. భర్తను చంపి పూడ్చిపెట్టిన భార్య



**హైదరాబాద్, జూలై 7:** నగరంలోని మియాపూర్‌లో దారుణం జరిగింది. కట్టుకున్న భర్తను ప్రియుడితో కలిసి భార్య అత్యంత కిరాతంగా హత్య చేసింది. ఆ తరువాత భర్త కనిపించడం లేదంటూ గతేడాది నవంబర్‌లో పోలీసులకు ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసుగా నమోదు చేసిన మియాపూర్ పోలీసులు.. దర్యాప్తు చేపట్టగా అసలు నిజాలు బయటకు వచ్చాయి. ఏడు నెలల తర్వాత ఈ కేసులో భార్యే హంతకురాలిగా పోలీసులు తేల్చారు. భర్తను భార్యే హత్య చేసి ఆపై కనపించడం లేదంటూ నాటకం ఆడినట్లు పోలీసులు గుర్తించారు. దర్యాప్తులో భాగంగా భార్య కాల్ రికార్డ్సను, సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించారు. ఈ క్రమంలో ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసినట్లు పోలీసులు నిర్ధారించారు.భర్తను చంపి మృతదేహాన్ని మహారాష్ట్ర బోర్డర్ వరకు తరలించి పూడ్చిపెట్టినట్లు పోలీసులు తెలిపారు. స్థానిక పోలీసుల సహాయంతో మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడు పెంటేష్(45)గా గుర్తించారు. తన ప్రేమ వ్యవహారానికి భర్త అడ్డుగా ఉన్నాడనే కారణంతో వెంకటేష్‌ను హత్య చేసినట్లు పోలీసుల విచారణలో భార్య అంగీకరించింది. ప్రస్తుతం నిందితురాలిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆమె గాలింపు చర్యలు చేపట్టారు. ప్రియుడి కోసం కట్టుకున్న భర్తను భార్య హత్య చేసిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

## మాజీ ఎమ్మెల్యే కొమ్మిడి నర్సింహారెడ్డి మృతి పట్ల కేసీఆర్ సంతాపం



**హైదరాబాద్ :** తొలిదశ తెలంగాణ ఉద్యమకారుడు, భువనగిరి మాజీ ఎమ్మెల్యే కొమ్మిడి నర్సింహా రెడ్డి మరణం పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం ప్రకటించారు. రాజకీయాల్లో నిరాడంబరత, నీతి నిజాయితీకి నిదర్శనంగా నిలిచిన ప్రజల మనిషి నర్సింహా రెడ్డి అని, వారి కృషిని కేసీఆర్ స్మరించుకున్నారు. భూదానోద్యమంలో తను వందలాది ఎకరాలను పేదలకు పంచిన నర్సింహా రెడ్డి, 1969లో తెలంగాణ రాష్ట్ర సాధనోద్యమంలో పాల్గొని, మూసీ పరిరక్షణ, తెలంగాణకు గోదావరి నదీ జలాల కోసం కృషి చేశారని తెలిపారు. శోక తప్తులైన కొమ్మిడి నర్సింహారెడ్డి కుటుంబ సభ్యులకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# కోట్ల రూపాయల ప్రభుత్వ ఆదాయం డైవర్షన్



**హైదరాబాద్,:**జనవరిలో బయటపడిన కుంభకోణం గురించి ఇంకా ఎందుకు విచారణ జరగలేదు..అని బీఆర్ఎస్ సెక్రటరీ జనరల్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రభుత్వాన్నిప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జనగామ జిల్లాలో ప్రభుత్వానికి రావాల్సిన కోట్ల రూపా యల ఆదాయాన్ని 38 మీసేవ కేంద్రాల నిర్వా హకులు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు అంతా కలిసి ఒక సాఫ్ట్‌వేర్ వినియోగించి వారంతా తీసుకుని.. రైతుకు మాత్రం కేవలం 10 వేల రూపాయలు లేదా లక్ష రూపాయలని చూపించి ప్రభుత్వానికి మాత్రం కేవలం 1 రూపాయి మాత్రమే కట్టారన్నారు. అంటే రైతు దగ్గర మాత్రం లక్ష రూపాయలు కలెక్ట్ చేసుకుంటడు. ప్రభుత్వానికి మాత్రం ఆ 5 సున్నాలు తీసేసి ఒకటే రూపాయి అని చెప్పి కట్టారన్నారు. ఆనాడు ఈ భూభారతి కుంభకోణం బయటపడ్డది. ఆనాడు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రెస్ మీట్ పెట్టి ఇది చాలా చిన్నది. ప్రతిపక్ష పార్టీలు మాట్లాడుతున్నట్టు ఇది వేల కోట్ల కుంభకోణం కాదు. కేవలం 3 కోట్ల 95 లక్షల స్కాం మాత్రమే అని జనవరి 2026లో గౌరవ మంత్రి చెప్పారన్నారు. ఆ వార్త బయటికి వచ్చి ఇప్పటికీ 7 నెలలు గడుస్తుంది. అప్పుడేమో రెవెన్యూ మంత్రి మేం పెద్ద ఎత్తున విచారణకు ఆదేశించాం. కానీ ఎలాంటి అక్రమాలు జరుగుతుండగా చూస్తున్నారు. మీరు, ముఖ్యమంత్రి ప్రజల చెవుల్లో పువ్వులు పెట్టడంలో పీహెచ్‌డీ చేశారని ఇప్పటికే అందరికీ అర్థమైందన్నారు.వేగవంతంగా విచారణ జరుపుతున్నామని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నాడు. మళ్లీ గత నెల 19, 20వ తేదీల్లో శేరిలింగంపల్లి, కాజాగూడలోని 13 మరియు 16 గుంటల భూమిని ౼ూూ ×చీఖీ=ూ సంస్థకు అక్రమంగా బదిలీ చేశారన్నారు. ఆ విషయం కనీసం స్థానిక అధికారులకు కూడా తెలియదు. లక్షల కోట్ల విలువైన డేటా మేనేజ్ చేసే చీ×జ సంస్థకు భూ భారతి నిర్వహణ బాధ్యతలు ఇచ్చినా, వారికి కూడా ఈ అక్రమాల గురించి తెలియదు అంటున్నారు. ఈ అక్రమాల గురించి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఎప్పుడూ రివ్యూ చేయలేదు, ఎందుకంటే ఆ అక్రమాల వెనుక ఉన్నది అతనేనన్నారు.

# సంజూ శాంసన్‌పై వేటు.. జింబాబ్వే సిరీస్‌కు టీమిండియా ప్రకటన




బీసీసీఐ జింబాబ్వే పర్యటనకు వెళ్లే 15 మంది సభ్యులతో కూడిన సరికొత్త టీమిండియా జట్టును అధికారికంగా ప్రకటించింది. జూలై 23 నుంచి ప్రారంభం కానున్న ఈ మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ కోసం సెలెక్టర్లు యంగ్ బ్లడ్?ను నమ్ముకున్నారు. ప్రస్తుతం ఇంగ్లాండ్ పర్యటనలో ఉన్న సీనియర్ ఆటగాళ్లలో చాలా మందికి ఈ సిరీస్ నుంచి విశ్రాంతి కల్పించారు. స్టార్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ ఈ యువ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించనుండగా, యువ ఆల్‌రౌండర్ తిలక్ వర్మకు వైస్ కెప్టెన్సీ బాధ్యతలను అప్పగించారు. ఈ సిరీస్ ద్వారా భవిష్యత్తు టీ20 జట్టును నిర్మించడమే లక్ష్యంగా బీసీసీఐ అడుగులు వేస్తోంది.

ఈ జట్టు ప్రకటనలో అందరినీ ఆశ్చర్యపరిచిన విషయం ఏమిటంటే.. సీనియర్ వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ పేరు ఈ స్క్వాడ్‌లో లేకపోవడం. గత కొన్ని ఇన్నింగ్స్‌లుగా వరుసగా విఫలమవుతూ వస్తున్న సంజూపై సెలెక్టర్లు వేటు వేశారు. అతనితో పాటు అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, రవి బిష్ణోయ్, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ వంటి ఆటగాళ్లను కూడా ఈ పర్యటనకు ఎంపిక చేయలేదు. సంజూ శాంసన్ స్థానంలో ఇషాన్ కిషన్ తిరిగి వికెట్ కీపర్‌గా జట్టులోకి రాగా, బ్యాకప్ కీపర్‌గా ప్రభ్‌సిమ్రన్ సింగ్‌కు మళ్లీ పిలుపు వచ్చింది. 2023 ఆసియా క్రీడల తర్వాత ప్రభ్‌సిమ్రన్ భారత జట్టులోకి రావడం ఇదే మొదటిసారి. ఈ పర్యటన ద్వారా పలువురు అన్‌క్యాప్డ్ ఆటగాళ్లకు భారత జట్టు తరఫున ఆడే సువర్ణ అవకాశం దక్కింది. దేశవాళీ క్రికెట్, ఐపీఎల్‌లో అద్భుతంగా రాణించిన యష్ ఠాకూర్, అశోక్ శర్మలు తొలిసారి భారత టీ20 జట్టుకు ఎంపికయ్యారు. అలాగే గంటకు 150 కిలోమీటర్ల కంటే ఎక్కువ వేగంతో బౌలింగ్ చేయగల టీమిండియా యువ స్పీడ్‌స్టర్ మయాంక్ యాదవ్ గాయం నుంచి కోలుకుని తిరిగి జట్టులోకి చేరాడు. 2024లో చివరిసారిగా భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన మయాంక్.. తన పేస్ పవర్‌తో జింబాబ్వే బ్యాటర్లను భయపెట్టేందుకు సిద్ధమయ్యాడు. వీరితో పాటు హర్ష్ దూబే, సూర్యాంశ్ షెడ్గే, ప్రిన్స్ యాదవ్ వంటి నయా యువ ఆటగాళ్లకు కూడా ఈ జట్టులో చోటు దక్కింది. ఈ పర్యటనలో భాగంగా భారత్, జింబాబ్వే జట్ల మధ్య మొత్తం మూడు టీ20 మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈ మ్యాచ్‌లన్నీ జింబాబ్వే రాజధాని హరారేలోని క్లబ్ మైదానంలోనే జరగడం విశేషం. జూలై 23న మొదటి టీ20 మ్యాచ్, జూలై 25న రెండో టీ20 మ్యాచ్, జూలై 26న మూడో చివరి టీ20 మ్యాచ్ జరగనున్నాయి. వరుస రోజుల్లో మ్యాచ్‌లు



# క్రికెట్ ప్రపంచంలో తెలుగోడి సంచలనం

భారత క్రికెట్‌లో సరికొత్త శకం మొదలైంది. సీనియర్ల గైర్హాజరీలో యువ ఆటగాళ్లు మైదానంలో పరుగుల వరద పారిస్తూ సరికొత్త రికార్డులను తమ పేరిట లిఖించుకుంటున్నారు. ప్రస్తుతం ఇంగ్లాండ్‌తో జరుగుతున్న టీ20 ఇంటర్నేషనల్ సిరీస్‌లో టీమిండియా యువ సంచలనం, వైస్ కెప్టెన్ తిలక్ వర్మ అద్భుత ప్రదర్శనతో అంతర్జాతీయ క్రికెట్ ప్రపంచాన్ని నివ్వెరపరిచాడు. ఇంగ్లాండ్‌తో జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో ఈ తెలుగు కుర్రాడు చెలరేగి ఆడి సరికొత్త మైలురాయిని అందుకున్నాడు. టీ20 ఇంటర్నేషనల్స్ చరిత్రలో అత్యంత తక్కువ వయస్సులోనే 1500 పరుగుల మార్కును దాటిన మొట్టమొదటి భారతీయ బ్యాటర్‌గా తిలక్ వర్మ చరిత్ర సృష్టించాడు. ఈ క్రమంలో అతడు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వంటి దిగ్గజాలను సైతం వెనక్కి నెట్టడం విశేషం. క్రికెట్ మైదానంలో రికార్డులు సృష్టించడం, అవి బద్దలవడం సహజమే అయినా.. దేశానికి చెందిన ఇద్దరు యువ తారల మధ్య జరిగిన ఈ పరుగుల పోటీ అభిమానులకు అసలైన మజాను అందించింది. ఇంగ్లాండ్ పర్యటనలో జులై 1వ తేదీన జరిగిన మొదటి టీ20 మ్యాచ్‌లో ఓపెనర్ అభిషేక్ శర్మ తన తుఫాన్ బ్యాటింగ్‌తో అంతర్జాతీయ టీ20ల్లో 1500 పరుగులు పూర్తి చేసుకున్నాడు. ఆ సమయంలో భారతదేశం తరపున అత్యంత పిన్న వయస్సులో ఈ ఘనత సాధించిన రికార్డు అభిషేక్ పేరిట నమోదైంది. అయితే, ఆ రికార్డు సంతోషం కనీసం రెండు రోజులు కూడా నిలవలేదు. జులై 3న జరిగిన రెండో మ్యాచ్‌లోనే తిలక్ వర్మ పరుగుల వేట సాగించి అభిషేక్ శర్మ రికార్డును స్క్రాప్ చేసేశాడు. భారత్ తరఫున టీ20 ఇంటర్నేషనల్స్‌లో అత్యంత వేగంగా 1500 పరుగులు పూర్తి చేసిన టాప్ 5 ఆటగాళ్ల జాబితాను పరిశీలిస్తే యువ ఆటగాళ్ల ఆధిపత్యం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ లిస్టులో తిలక్ వర్మ కేవలం 23 సంవత్సరాల 238 రోజుల వయస్సులోనే ఈ అరుదైన మైలురాయిని అందుకుని మొదటి స్థానంలో నిలిచాడు. కాగా, ఓపెనర్ అభిషేక్ శర్మ 25 సంవత్సరాల 300 రోజుల వయస్సులో ఈ ఘనత సాధించి రెండో స్థానంలో ఉన్నాడు. రికార్డుల రారాజు కింగ్ విరాట్ కోహ్లీ 27 సంవత్సరాల 143 రోజుల వయస్సులో ఈ మార్కును దాటి మూడో స్థానానికి పరిమితమయ్యాడు. ఆ తర్వాతి స్థానాల్లో కేఎల్ రాహుల్ (28 సంవత్సరాల 230 రోజులు),

## భారత్ వర్సెస్ ఇంగ్లాండ్ టీ20 పోరు..

భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య జరుగుతున్న టీ20 సిరీస్‌లో భాగంగా మూడో ఉత్కంఠభరిత పోరుకు నాటింగ్‌హామ్‌లోని చారిత్రాత్మక ట్రెంట్ బ్రిడ్జ్ మైదానం సిద్ధమైంది. ఈ హై-స్కోరింగ్ మైదానంలో మ్యాచ్ అనగానే క్రికెట్ అభిమానులకు ఎక్కడ లేని ఉత్సాహం వస్తుంది. దానికి ప్రధాన కారణం.. నాలుగేళ్ల క్రితం సరిగ్గా ఇదే మైదానంలో భారత స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ సృష్టించిన పరుగుల తుఫానే. మరోసారి ఇరు జట్లు ఈ మైదానంలో తలపడుతుండటంతో, నాటి చేదు జ్ఞాపకాలను తుడిచేసి సరికొత్త రికార్డును లిఖించాలని టీమిండియా పట్టుదలగా ఉంది. అలాగే ఈసారి సూర్య లాంటి మెరుపు ఇన్నింగ్స్ ఎవరు ఆడుతారా అని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ మైదానంతో భారత జట్టుకు ఒక మర్చిపోలేని జ్ఞాపకం ముడిపడి ఉంది. 2022 లో ఇక్కడ జరిగిన ఏకైక టీ20 మ్యాచ్‌లో ఇంగ్లాండ్ జట్టు మొదట బ్యాటింగ్ చేసి భారత బౌలర్లను చీల్చిచెండాడుతూ బోర్డుపై 215 పరుగుల భారీ లక్ష్యాన్ని ఉంచింది. 216 పరుగుల కొండంత టార్గెట్‌తో బరిలోకి దిగిన భారత్‌కు ఆరంభంలోనే గట్టి




షాక్‌లు తగిలాయి. టాప్ ఆర్డర్ కుప్పకూలిన తరుణంలో మైదానంలోకి వచ్చిన సూర్యకుమార్ యాదవ్ తన సంచలన బ్యాటింగ్‌తో ఇంగ్లీష్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. మైదానం నలుమూలలా 360 డిగ్రీల షాట్లతో విరుచుకుపడుతూ కేవలం 55 బంతుల్లోనే 14 ఫోర్లు, 6 గగనతలాన్ని తాకే సిక్సర్లతో 117 పరుగులు చేసి అద్భుత శతకాన్ని నమోదు చేశాడు. ఒంటరి పోరాటంతో భారత్‌ను గెలుపు అంచుల్లోకి తెచ్చినప్పటికీ, అవతలి ఎండ్ నుంచి ఎవరి సహకారం అందకపోవడంతో భారత్ ఆ మ్యాచ్‌లో 17 పరుగుల తేడాతో ఓడిపోయింది. ఐతే, టీ20 చరిత్రలోనే సూర్య ఆడిన ఆ ఇన్నింగ్స్ అత్యంత బెస్ట్ గా నిలిచిపోయింది. ట్రెంట్ బ్రిడ్జ్ మైదానంలో భారత జట్టు గత రికార్డులను పరిశీలిస్తే మిశ్రమ ఫలితాలు కనిపిస్తాయి. టీమిండియా ఇక్కడ ఇప్పటివరకు మొత్తం 4 అంతర్జాతీయ టీ20 మ్యాచ్‌లు ఆడగా, అందులో రెండు మ్యాచ్‌ల్లో విజయం సాధించింది, మరో రెండు మ్యాచ్‌ల్లో పరాజయాన్ని చవిచూసింది. ఇక్కడి పిచ్ ఎప్పుడూ బ్యాటర్లకే ఎక్కువగా అనుకూలిస్తుంది. బంతి బ్యాట్‌పైకి చాలా చక్కగా వస్తుండటంతో మరోసారి భారీ స్కోర్ నమోదయ్యే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. 2022 నాటి ఓటమి కసితో ఉన్న టీమిండియా, ఈసారి ఇంగ్లాండ్‌ను వారి హోం గ్రౌండ్‌లోనే మట్టికరిపించి సిరీస్‌లో

# దిగి వస్తున్న బంగారం ధరలు.. వెండి ధర ఎంతంటే.



ప్రస్తుతం దేశంలో బంగారం, వెండి ధరలు దిగి వస్తున్నాయి. మన భారతీయ సాంప్రదాయంలో బంగారానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. గుడ్ రిటర్న్ వెబ్‌సైట్ ప్రకారం, జూలై 7వ తేదీన దేశంలో బంగారం, వెండి ధరలు స్వల్పంగా తగ్గుముఖం పట్టాయి. హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 1,46,610 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,34,390 వద్ద కొనసాగుతోంది. అలాగే ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 1,46,710 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,34,540 వద్ద కొనసాగుతోంది. ముంబైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 1,46,610 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,34,390 వద్ద కొనసాగుతోంది. బెంగళూరులో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 1,46,610 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,34,390 వద్ద కొనసాగుతోంది. చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 1,47,920 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,35,590 వద్ద కొనసాగుతోంది. అలాగే కోల్‌కతాలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 1,46,610 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,34,390 వద్ద కొనసాగుతోంది. ఇక వెండి విషయానికొస్తే హైదరాబాద్, విజయవాడ, కేరళలో రూ.2,49,900 ఉండగా, ఢిల్లీ, ముంబై, రూ.2,44,900 వద్ద కొనసాగుతోంది. దాదాపు 5,600 డాలర్లకు చేరుకుని ఆల్ టైం రికార్డ్ సృష్టించిన గోల్డ్ ధరలు.. ఇప్పుడు 4,000 డాలర్ల కంటే దిగువకు చేరుకుంది. 30 శాతానికిపైగా ధరలు దిగొచ్చాయి. ఆరు నెలల్లో బంగారం ధరలు భారీగా కుప్పకూలుతూ వస్తోన్నాయి. అయితే రాబోయే కొద్ది వారాల్లో బంగారం ధర తిరిగి 4 వేల డాలర్లకు పెరగవచ్చని చెబుతున్నారు. 2026 చివరి నాటికి 4,900 డాలర్ల నుంచి 5 వేల డాలర్లకు పెరగవచ్చని అంటున్నారు. 2027లో మళ్లీ ఆల్ టైం రికార్డ్ స్థాయికి గోల్డ్ రేట్లు చేరుకుంటాయని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. 3,950 నుంచి 4,000 వద్ద బలమైన మద్దతు జోన్‌గా ఉంది. ఈ పాయింట్ల వద్ద గతంలో ధరలు పుంజుకున్నాయి. ఇప్పుడు కూడా అదే జరగనుందని అంచనా వేస్తున్నారు. రాబోయే రోజుల్లో పెట్టుబడిదారులు యూఎస్ ఫెడరల్ రిజర్వ్ విధాన వైఖరిని, ద్రవ్యోల్బణ మధ్యప్రాచ్యం వంటి కీలక వినియోగ మార్కెట్ల నుండి భౌతిక డిమాండ్‌ను నిశితంగా పర్యవేక్షిస్తారు. ఇవన్నీ బంగారం ధరలలో తదుపరి కదలికను నిర్ణయించడంలో కీలక పాత్ర పోషిస్తాయని బిజినెస్ అనలిస్టులు చెబుతున్నారు. తాజాగా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను పెంచే అవకాశం ఉందనే వార్తలు నెమ్మదిగా తగ్గుతున్న నేపథ్యంలో బంగారం ధరలు మళ్లీ పెరిగే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా అమెరికా డాలర్ విలువ బలపడటంతో బంగారం ధర మళ్ళీ తగ్గడం ప్రారంభించింది.

# పీపీఎఫ్ ఖాతాను బ్యాంకుకు లేదా పోస్ట్ ఆఫీస్‌కు బదిలీ చేయవచ్చా? నియమాలు ఏంటి?




పీపీఎఫ్ ఖాతాను బదిలీ చేయడానికి, అలాగే దానిని వేరొకరి పేరు మీద చేయవచ్చా లేదా అనే విషయానికి సంబంధించి ప్రత్యేక నియమాలు ఉన్నాయి. మీరు మీ పోస్ట్ ఆఫీస్ ఖాతాను బ్యాంకుకు లేదా బ్యాంకు ఖాతాను పోస్ట్ ఆఫీస్‌కు బదిలీ చేసినప్పుడు జమ చేసిన మొత్తం, వడ్డీ పూర్తిగా సురక్షితంగా ఉంటాయి. ఈ బదిలీ ప్రక్రియ ఎలా పనిచేస్తుందో, దీనికి ఏ పత్రాలు అవసరమో వివరంగా తెలుసుకోవడం ముఖ్యం. పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (ప్రాఫీ) భారతదేశంలోని అత్యంత ప్రజాదరణ పొందిన పొదుపు పథకాలలో ఒకటి. ఈ పథకంలో పెట్టుబడిదారులు తమ డబ్బును సురక్షితంగా పెట్టుబడి పెట్టి, దీర్ఘకాలం కోసం ఒక మంచి నిధిని నిర్మించుకోవచ్చు. పెట్టుబడిపై ప్రభుత్వ హామీ, పన్ను మినహాయింపు, సురక్షితమైన రాబడులు వంటి అనేక ప్రయోజనాలు దీనికి ఉన్నాయి. రాబడుల విషయానికి వస్తే, పీపీఎఫ్ పథకం 7.1 శాతం వార్షిక వడ్డీ రేటుతో రాబడులను అందిస్తుంది. ఇప్పుడు చాలా మంది పెట్టుబడిదారుల మనసులో మెదిలే ప్రశ్న ఏమిటంటే పీపీఎఫ్ ఖాతాను ఒక బ్యాంకు నుండి మరొక బ్యాంకుకు లేదా పోస్ట్ ఆఫీస్ నుండి బ్యాంకుకు లేదా బ్యాంకు నుండి పోస్ట్ ఆఫీస్‌కు బదిలీ చేయవచ్చా? అలాగే పీపీఎఫ్ ఖాతాను వేరొకరి పేరు మీదకు బదిలీ చేయవచ్చా? దీని గురించి తెలుసుకుందాం.

పీపీఎఫ్ ఖాతా బదిలీ:పీపీఎఫ్ ఖాతాను ఒక బ్యాంకు నుండి మరొక బ్యాంకుకు, పోస్ట్ ఆఫీస్ నుండి బ్యాంకుకు లేదా బ్యాంకు నుండి పోస్ట్ ఆఫీస్‌కు సులభంగా బదిలీ చేసుకోవచ్చు. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఖాతా బదిలీ అయినప్పుడు, దాని మెచ్యూరిటీ కాలం, డిపాజిట్లు, వడ్డీ, పన్ను ప్రయోజనాలపై ఎలాంటి ప్రభావం ఉండదు. మీ పీపీఎఫ్ ఖాతా యథావిధిగా కొనసాగుతుంది. పీపీఎఫ్ ఖాతాను ఎలా బదిలీ చేస్తారు?పీపీఎఫ్ ఖాతా బదిలీ కోసం, పెట్టుబడిదారుడు తన బ్యాంకుకు లేదా పోస్ట్ ఆఫీసుకు దరఖాస్తు చేసుకోవాలి. దీని తర్వాత సంబంధిత సంస్థ అతని ఖాతాకు సంబంధించిన ఖాతా స్టేట్‌మెంట్, నామినేషన్, ఇతర రికార్డుల వంటి అవసరమైన అన్ని పత్రాలను కొత్త బ్యాంకుకు లేదా పోస్ట్ ఆఫీసుకు పంపుతుంది. పత్రాలను స్వీకరించిన తర్వాత కొత్త సంస్థ బదిలీ ప్రక్రియను పూర్తి చేస్తుంది. చాలా సందర్భాలలో కస్టమర్ మళ్లీ ఖ్జ పత్రాలను కూడా సమర్పించాల్సి రావచ్చు. పీపీఎఫ్ ఖాతాను వేరొకరి పేరు మీదకు బదిలీ చేయవచ్చా?పీపీఎఫ్ ఖాతా దానిని తెరిచిన వ్యక్తి పేరు మీద మాత్రమే ఉంటుంది. దానిని అమ్మడం, బహుమతిగా ఇవ్వడం లేదా వేరొక వ్యక్తికి బదిలీ చేయడం కుదరదు. ముందుగా మీ కేవైసీ పత్రాలు, మొబైల్ నంబర్, చిరునామా, నామినీ


# రోజుకు రూ.100 ఆదా చేస్తే.. రూ.5 లక్షలు మీ చేతికి.. మార్కెట్లో బెస్ట్ స్కీమ్ ఇదే..

దేశంలో పోస్ట్ ఆఫీస్ పొదుపు పథకాలు బాగా పాపులర్ అయ్యాయి. నగదుకు భద్రతతో పాటు కేంద్ర ప్రభుత్వం హామీ కూడా ఉంటుంది. దీంతో పోస్టాఫీస్ స్కీమ్స్ అత్యంత ప్రజాదరణ పొందాయి. నేషనల్ సేవింగ్స్ రికరింగ్ డిపాజిట్ అకౌంట్ పోస్టాఫీసు పథకాల్లో భాగా పాపులర్ అయింది. దీనిని పోస్టాఫీస్ =ణగా పిలుస్తున్నారు. నెలకు కేవలం రూ.100 పెట్టుబడితో మంచి ఆదాయం పొందవచ్చు. నెలకు రూ.3 వేల పెట్టుబడితో రూ.5 లక్షల వరకు సంపాదించవచ్చు. ఈ పథకంలో అనేక ప్రయోజనాలు ఉన్నాయి. 6.7 శాతం వడ్డీ రేటు, రుణం తీసుకునే సౌకర్యం, మెచ్యూరిటీ తర్వాత అకౌంట్‌ను పొడిగించుకునే అవకాశం లాంటివి చాలానే ఉన్నాయి.

ప్రతీ నెలా రూ.3 వేలు ఆదా చేస్తే..పోస్ట్ ఆఫీస్ ఆర్డీ పథకం ప్రస్తుతం 6.7 శాతం వార్షిక వడ్డీని అందిస్తోంది. మీరు రోజుకు రూ.100 ఆదా చేసే నెలకు రూ.3 వేలు అవుతుంది. 10



సంవత్సరాల పాటు ఇలాగే కొనసాగిస్తే మొత్తం రూ.3.60 లక్షలు అవుతుంది. 6.7 వార్షిక వడ్డీ ప్రకారం లెక్కిస్తే 10 ఏళ్లల్లో రూ.1,52,565 పొందుతారు. 10 ఏళ్లు ముగిశాక అసలు, వడ్డీ కలిపి రూ. 5,12,565 మీకు ఒకేసారి అందుతుంది. సామాన్యులను దృష్టిలో పెట్టుకుని ఈ స్కీమ్ తీసుకొచ్చారు. ఏ భారత పౌరుడైనా ఈ పథకంలో చేరవచ్చు. కనీస పెట్టుబడి కేవలం రూ.100 నుండి స్టార్ట్ చేయవచ్చు. అయితే దీనికి ఎలాంటి గరిష్ట పరిమితి లేదు. మీరు ఎంత అయినా పెట్టుబడి పెట్టవచ్చు. పిల్లల పేరు మీద కూడా తల్లిదండ్రులు ఈ అకౌంట్ తెరవొచ్చు. పిల్లల వయస్సు 10 ఏళ్లు దాటితే నేరుగా వారి పేరు మీద ఓపెన్ చేయవచ్చు. 50 శాతం రుణం తీసుకోవచ్చుఖాతా తెరిచిన ఒక సంవత్సరం తర్వాత.. మీరు వరుసగా 12 వాయిదాలు చెల్లించి ఉంటే..మీ మొత్తం డిపాజిట్‌లో 50 శాతం వరకు రుణంగా తీసుకోవచ్చు. ఈ రుణంపై నిర్ణీత ఆర్డీ వడ్డీ రేటు కంటే కేవలం 2 శాతం మాత్రమే ఎక్కువ వడ్డీ చెల్లిస్తారు. రుణాన్ని ఒకేసారి లేదా నెలవారీ వాయిదాలలో తిరిగి చెల్లించే అవకాశం అందుబాటులో ఉంది. ఒకవేళ ఏదైనా కారణం చేత మీరు రుణాన్ని తిరిగి చెల్లించలేకపోతే ఖాతా మెచ్యూరిటీ సమయంలో మీకు అందే తుది నిధి నుండి బకాయి ఉన్న మొత్తాన్ని తీసివేస్తారు.



# ఆ హీరో మూవీ డిజాస్టర్ అయ్యింది.

దర్శకుడు వి.వి. వినాయక్ ప్రస్తుతం సినిమాల స్పీడ్ తగ్గించారు. ఒకప్పుడు ఆయన సినిమాలకు విపరీతమైన క్రేజ్ ఉండేది. స్టార్ హీరోలతో సినిమాలు చేసి బ్లాక్ బస్టర్స్ అందుకున్నారు వివి వినాయక్. కాగా గతంలో ఓ ఇంటర్వ్యూలో వివి వినాయక్ మాట్లాడుతూ.. తన సుదీర్ఘ సినీ ప్రస్థానం, వ్యక్తిగత విలువలు, చిత్రాల విజయం, పరాజయాలపై మనసు విప్పి మాట్లాడారు. తన కెరీర్ ఆరంభం నుంచి తోడు నిలిచిన నిర్మాతలకు, పంపిణీదారులకు ఎల్లప్పుడూ కృతజ్ఞతతో ఉంటానని, వారికి నష్టం రాకుండా చూడటమే తన ధ్యేయమని ఆయన స్పష్టం చేశారు వినాయక్. అలాగే ఆయన మాట్లాడుతూ.. వినాయక్ తన తొలి అడ్వాన్స్ బెల్లంకొండ సురేష్ గారి వద్ద తీసుకున్నట్లు, ఆ తర్వాత దిల్ సినిమాకు దిల్ రాజు గారితో, చిరంజీవి గారి ఠాగూర్ చిత్రంతో తన కల నెరవేరినట్లు తెలిపారు. కొడాలి నాని, మల్లెడి సత్యనారాయణ రెడ్డి, గాంధీ, కాశీ వంటి తన స్నేహితులకు, శ్రేయోభిలాషులకు సినిమాలు చేసినట్లు వెల్లడించారు. శ్రీను వైట్ల వంటి సన్నిహితులతో కలసి వారితో సాగిన అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. తాను కష్టాల్లో ఉన్నప్పుడు తోడు నిలిచిన వారందరికీ తన సినిమాల ద్వారా లబ్ధి చేకూర్చాలని తాను ఎప్పుడూ ప్రయత్నిస్తానని, హీరోల రెమ్యూనరేషన్‌తో సంబంధం లేకుండా తనకు న్యాయం జరిగితేనే సినిమాలు చేస్తానని ఆయన చెప్పారు. తన కెరీర్‌లో విజయాలు మాత్రమే కాకుండా, యోగి, అఖిల్ వంటి చిత్రాలపై వచ్చిన ఫ్లాప్ ముద్ర గురించి కూడా వినాయక్ వివరించారు. ఆది సినిమా విజయవంతమైనా, ఆ తర్వాత తనకు ఎదురుదెబ్బ తగిలిందని, అయితే తన ఏ సినిమా కూడా పూర్తిగా నాశనమయ్యేంత డిజాస్టర్ కాలేదని ఆయన అన్నారు. యోగి సినిమా ఫ్లాప్ అయినా, ఎవ్వరికీ ఆఫీసులు మూసేసేంత నష్టం రాకుండా చూసుకున్నానని తెలిపారు. ముఖ్యంగా అఖిల్ సినిమా గురించి మాట్లాడుతూ, ఇది ఫ్లాప్ చిత్రంగా ముద్రపడినప్పటికీ, నైజాం ప్రాంతంలో ఆరు కోట్ల రూపాయల వరకు వసూళ్లు సాధించిందని, విశాఖపట్నం లాంటి ప్రాంతాల్లో రెండున్నర కోట్ల రూపాయల వరకు వసూళ్లు చేసినట్లు వెల్లడించారు.

“ఒక హీరోకి సూపర్ హిట్ వస్తే ఎంత డబ్బు వస్తుందో ఆ సినిమాకి వచ్చింది” అని ఆయన అన్నారు. అయితే, సినిమాను అత్యంత భారీ ధరలకు అమ్మడం వల్లే పంపిణీదారులు నష్టపోయారని వినాయక్ అన్నారు. ఆ సమయంలో తాను స్వయంగా రంగంలోకి దిగి, తన రెమ్యూనరేషన్‌లో కొంత భాగాన్ని వదులుకొని, పంపిణీదారులకు 50 శాతం నష్టాన్ని పూడ్చినట్లు స్పష్టం చేశారు. “ఎంత డబ్బు ఇస్తే మీరు సంతోషంగా ఉంటారు?” అని అడిగి, ఆ డబ్బును తాను చెల్లించానని, ఆ సినిమా నుండి తాను ఎలాంటి లాభమూ పొందలేదని అన్నారు వినాయక్. అదేవిధంగా తన దృష్టిలో ఫెయిల్యూర్ అంటే ఏమిటో వివరించారు. కేవలం ఆర్థికంగా నష్టం రావడమే కాకుండా, 100 మంది ప్రేక్షకులు థియేటర్‌కు వెళ్తే, వారిలో కనీసం 60-65 మందికి సినిమా నచ్చితే అది విజయానికి దగ్గరగా ఉంటుందని, ప్రేక్షకులు పూర్తిగా తిరస్కరించిన సినిమానే నిజమైన పరాజయమని ఆయన

కొత్త అందాలు ఎప్పటికప్పుడు ప్రేక్షకులను అలరిస్తున్నాయి. సినిమా సినిమాకు కొత్త హీరోయిన్స్ పరిచయం అవుతున్నారు. ఇదే సమయంలో కొందరు హీరోయిన్స్ ఒకటి రెండు సినిమాలతోనే పాపులర్ అవుతున్నారు. చాలా మంది హీరోయిన్స్ ఓవర్ నైట్ లోనే స్టార్ గా మారిపోయారు. కానీ కొంతమంది మాత్రం ఎంత ప్రయత్నించినా కూడా స్టార్ డమ్ దక్కించుకోలేకపోతున్నారు. అలాంటి వారిలో పైన కనిపిస్తున్న భామ ఒకరు. తన అందంతో కుర్రాళ్లను మాయలో పడేసింది ఈ చిన్నది. అలాగే నటనలోనూ మంచి మార్కులు కొట్టేసింది ఈ బ్యూటీ. ఈ చిన్నది చేసిన సినిమాలన్నీ ఫ్లాప్ అయ్యాయి. కెరీర్ లో ఒకే ఒక్క భారీ హిట్ అందుకుంది ఆ బ్యూటీ. కెరీర్ పీక్ లో ఉండగానే యాక్సిడెంట్ కు గురయ్యింది. అదృష్టం కొద్దీ ప్రాణాలతో బయటపడింది. దాదాపు రెండేళ్లు బెడ్ కే పరిమితం అయ్యింది. ఇంతకూ ఈ ముద్దుగుమ్మ ఎవరో తెలుసా.? వరుస సినిమాలతో ఫుల్ బిజీగా మారింది పై ఫొటోలో ఉన్న భామ. కెరీర్ స్టార్టింగ్ లోనే భారీ హిట్ అందుకుంది. ఆతర్వాత కొన్ని ఫ్లాప్స్ అందుకుంది. కెరీర్ పీక్ లో ఉండగానే యాక్సిడెంట్ కు గురయ్యింది. కెరీర్ లో ఒకే ఒక్క భారీ హిట్ అందుకుంది ఆ బ్యూటీ. కెరీర్ పీక్ లో ఉండగానే యాక్సిడెంట్ కు గురయ్యింది. అదృష్టం కొద్దీ ప్రాణాలతో బయటపడింది. దాదాపు రెండేళ్లు బెడ్ కే పరిమితం అయ్యింది. ఇంతకూ ఈ ముద్దుగుమ్మ ఎవరో తెలుసా.? వరుస సినిమాలతో ఫుల్ బిజీగా మారింది పై ఫొటోలో ఉన్న భామ. కెరీర్ స్టార్టింగ్ లోనే భారీ హిట్ అందుకుంది. ఆతర్వాత కొన్ని ఫ్లాప్స్ అందుకుంది. కెరీర్ పీక్ లో ఉండగానే యాక్సిడెంట్ కు గురయ్యింది. ఆమె ఎవరంటే అందాల నభా నటేష్. నన్ను దోచుకుందువటే సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయ్యింది. సుధీర్ బాబు హీరోగా నటించిన ఈ సినిమా ఆశించిన స్థాయిలో విజయం సాధించలేదు. ఆతర్వాత వరుసగా సినిమాలు చేసింది. పూరిజగన్నాథ్ దర్శకత్వంలో వచ్చిన ఇస్మార్ట్ శంకర్ సినిమాతో మంచి విజయాన్ని అందుకుంది. ఈ సినిమా భారీ హిట్ అందుకోవడంతో పాటు కలెక్షన్స్ కూడా భారీగా రాబట్టింది. ఆతర్వాత బ్యాక్ టు బ్యాక్ సినిమాలు అందుకుంది. ఆమె ఎవరంటే అందాల నభా నటేష్. నన్ను దోచుకుందువటే సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయ్యింది. సుధీర్ బాబు హీరోగా నటించిన ఈ సినిమా ఆశించిన స్థాయిలో విజయం సాధించలేదు.

# ఒక్క యాక్సిడెంట్ అంతా మార్చేసింది.

## నభా నటేష్






# తాతగారి వారసత్వాన్ని ఎప్పుడు తీసుకుంటారు అంటే.

జూనియర్ ఎన్టీఆర్ గతంలో ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత, రాజకీయ అభిప్రాయాలను నిర్భయంగా పంచుకున్నారు. బాలకృష్ణ పట్ల తనకున్న అమితమైన ప్రేమ, తెలుగుదేశం పార్టీ పట్ల తన నిబద్ధత, తన రాజకీయ ఆకాంక్షలపై స్పష్టతనిచ్చారు. నందమూరి బాలకృష్ణ అంటే తనకు ఎంతో ఇష్టమని జూనియర్ ఎన్టీఆర్ పదే పదే నొక్కి చెప్పారు. “బాల బాబాయ్ అంటే చాలా ఇష్టం. చాలా అద్భుతమైన మనిషి, చాలా మంచి మనిషి” అని అన్నారు. బాలకృష్ణ మూడీగా ఉంటారన్న బయట అభిప్రాయాలను ఖండిస్తూ, అవి “తెలిసి తెలియకుండా వాగడం” వంటివని కొట్టిపారేశారు. నందమూరి కుటుంబంలో బాలకృష్ణ తనకు ఎంతో ప్రత్యేకమని ఎన్టీఆర్ స్పష్టం చేశారు. తాతగారి వారసత్వాన్ని ఎప్పుడు తీసుకుంటారు అంటూ రాజకీయ భవిష్యత్తుపై అడిగిన ప్రశ్నకు జూనియర్ ఎన్టీఆర్ స్పష్టమైన సమాధానం ఇచ్చారు. తాను ప్రస్తుతం తెలుగుదేశం పార్టీకి కార్యకర్తని అని, జీవితాంతం పార్టీ ఉప్పు తిని బ్రతకాలని కోరుకుంటున్నానని చెప్పారు. “ఫ్యూచర్ అంటారా అది ఎవరం ఏమి చెప్పలేం. దాని గురించి మనం ఇప్పుడే మాట్లాడి ప్రయోజనం లేదు” అని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి పదవిపై తనకు ప్రస్తుతానికి ఎటువంటి ఆలోచన లేదని, అటువంటి ఆలోచన ఎప్పుడు మొదలైతే అప్పుడే వెల్లడిస్తానని తెలిపారు. ముఖ్యమంత్రి కావడానికి కేవలం ఆశ ఉంటే సరిపోదని, సాధన ఉండాలి అని ఆయన బలంగా చెప్పారు. డెస్టినీని నమ్ముతానని, రాతలో ఉంటే జరుగుతుందని, లేకపోతే ఎంత ప్రయత్నించినా కాదని అన్నారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, తన తాతగారు నందమూరి తారక రామారావు స్థాపించిన పార్టీ పట్ల తనకు, తన కుటుంబానికి అపారమైన విశ్వాసం ఉందని జూనియర్ ఎన్టీఆర్ అన్నారు. “పసుపు జెండాను చూస్తే మాకు ఏమవుతుందో తెలియదు నర నరాన పూనకం వస్తుందని” అని తన భావోద్వేగాన్ని వ్యక్తం చేశారు. తాతగారు ఎన్టీఆర్‌ని పదవి నుంచి తొలగించి చంద్రబాబు నాయుడు పార్టీని టేక్ ఓవర్ చేసిన ఎపిసోడ్ గురించి అడిగినప్పుడు జూనియర్ ఎన్టీఆర్ చాలా సున్నితంగా

# నాగదుర్గ హీరోయిన్‌గా తమిళ సినిమా



తెలంగాణ ప్రాంతానికి చెందిన నాగదుర్గ ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. ఫోక్ సాంగ్స్ ద్వారా విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకుంది. ముఖ్యంగా సోషల్ మీడియా, యూట్యూబ్ ప్రైవేట్ సాంగ్స్ ద్వారా మంచి గుర్తింపు తెచ్చుకుంది. తన డ్యాన్స్, నటనతో కుర్రకారును ఆకట్టుకున్న ఈ బ్యూటీ, ఇప్పుడు వెండితెరపై హీరోయిన్‌గా తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమయ్యింది. ప్రియదర్శి హీరోగా తెరకెక్కుతున్న ఇడుపు కాయితం అనే సినిమాలో కథానాయికగా నటిస్తుంది. ఇటీవల విడుదలైన టైటిల్ పోస్టర్ క్షణాల్లో వైరల్ అయ్యింది. అయితే తెలుగు కంటే ముందే నాగదుర్గ కోలీవుడ్ ఇండస్ట్రీలోకి అడుగుపెడుతుంది. నాగదుర్గ మొదటిసారి తమిళంలో హీరోయిన్‌గా నటించిన చిత్రం ‘లవ్ ఓ లవ్’ (ాశీజవ వ్ాష్ట్ర ాశీజవ). ఈ సినిమా తమిళంతో పాటు తెలుగు ప్రేక్షకులను కూడా అలరించడానికి సిద్ధమవుతోంది. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన అఫీషియల్ ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ ట్రైలర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో “అన్నీ నా దగ్గర నుంచే ఆశించడం కాదు.. నా కోసం నువ్వు ఏం చేశావు?” అని హీరో హీరోయిన్‌ను ప్రశ్నించే సరికొత్త కోణంతో ఈ లవ్ స్టోరీని తెరకెక్కించారు. ఈ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ ముఖ్యంగా నేటితరం అబ్బాయిలకు బాగా కనెక్ట్ అయ్యేలా కనిపిస్తోంది. ఈ సినిమాలో పవిష్



# ఇంట్లో శుభకార్యం.. పట్టు చీర, భారీ ఆభరణాలతో మెరిసిపోయిన దిల్ రాజు భార్య.

టాలీవుడ్ అగ్ర నిర్మాత దిల్ రాజు భార్య తేజస్విని సోషల్ మీడియాలో ఫుల్ యాక్టివ్ గా ఉంటుంది. తన పర్సనల్ అండ్ ప్రొఫెషనల్ లైఫ్ నకు సంబంధించిన విషయాలను అందులో షేర్ చేసుకుంటుంది. ముఖ్యంగా తన కుమారుడి ఫొటోలు, వీడియోలను ఇన్ స్టాలో షేర్ చేస్తోంది. తాజాగా దిల్ రాజు ఇంట్లో ఓ శుభకార్యం జరిగినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా తేజస్విని ట్రెడిషన్ లో లుక్ లో దర్శనమిచ్చింది. పట్టుచీర కట్టి, నగలు ధరించి, పూలు పెట్టి ఎంతో అందంగా కనిపించింది తేజస్విని. తాజాగా దిల్ రాజు ఇంట్లో ఓ శుభకార్యం జరిగినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా తేజస్విని ట్రెడిషన్ లో లుక్ లో దర్శనమిచ్చింది. పట్టుచీర కట్టి, నగలు ఇందుకు సంబంధించిన ఫొటోలను స్వయంగా తేజస్వినినే సోషల్ మీడియాలో షేర్ చేసింది. ‘ఉపనయనం ఫంక్షన్ నుంచి కొన్ని బ్యూటిఫుల్ మూమెంట్స్’ అంటూ ఈ ఫొటోలకు సరదాగా క్యాప్షన్ ఇచ్చింది తేజస్విని. ప్రస్తుతం ఈ ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో తెగ వైరల్ అవుతున్నాయి. ఇందుకు సంబంధించిన ఫొటోలను స్వయంగా తేజస్వినినే సోషల్ మీడియాలో షేర్ చేసింది. ‘ఉపనయనం ఫంక్షన్ నుంచి కొన్ని బ్యూటిఫుల్ మూమెంట్స్’ అంటూ ఈ ఫొటోలకు సరదాగా క్యాప్షన్ ఇచ్చింది తేజస్విని. ప్రస్తుతం ఈ ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో తెగ వైరల్ అవుతున్నాయి. కాగా దిల్ రాజు ఇప్పుడు తెలంగాణ ఫిల్మ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ గా కీలక బాధ్యతలు నిర్వర్తిస్తోన్న సంగతి తెలిసిందే. దీంతో ఈ మధ్యన సినిమాల నిర్మాణాన్ని బాగా తగ్గించేశారు దిల్ రాజు. కాగా దిల్ రాజు ఇప్పుడు తెలంగాణ ఫిల్మ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ గా కీలక బాధ్యతలు నిర్వర్తిస్తోన్న సంగతి తెలిసిందే. దీంతో ఈ మధ్యన సినిమాల నిర్మాణాన్ని బాగా తగ్గించేశారు దిల్ రాజు. చివరిగా నితిన్ తమ్ముడు సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు దిల్ రాజు. భారీ అంచనాల మధ్య రిలీజైన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద బోల్తా పడింది. ప్రస్తుతం విజయ్ దేవరకొండతో రౌడీ జనార్ధన అనే సినిమాను నిర్మిస్తున్నారీ స్టార్ ప్రొడ్యూసర్. రవి కిరణ్ కోలా ఈ సినిమాకు దర్శకుడు.

చివరిగా నితిన్ తమ్ముడు సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు దిల్ రాజు. భారీ అంచనాల మధ్య రిలీజైన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద బోల్తా పడింది. ప్రస్తుతం విజయ్ దేవరకొండతో రౌడీ జనార్ధన అనే సినిమాను నిర్మిస్తున్నారీ స్టార్ ప్రొడ్యూసర్. రవి కిరణ్ కోలా ఈ సినిమాకు దర్శకుడు.

“This newspaper/periodical is published by KALIDINDI RAJA JAGADESHWAR SANTOSH from D. NO. 24-11/2-14, LANKAVARI VEEDHI, BHAVAJIPETA, 4TH LINE, NEAR MAHALAXMIGUDI, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520003.on behalf of KALIDINDI RAJA JAGADESHWAR SANTOSH, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by PETTA VENKATA SURYANARAYANA at SREE SESHASAI ENTERPRISES. 3-88, CHANDRA THEATRE, MAIN ROAD, GOSALA, KRISHNA, ANDHRA PRADESH - 521151.